జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | మంగళవారం 10 నవంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :295 | పేజీలు : 12 | వెల : 3/-

PRGI No. APTEL/26/A0119,

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏజెన్సీ/కరస్పాండెంట్ ఇంటర్వ్యూలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు


9440231967

సంవత్సరం: శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: ఆశ్వయుజ మాసం ఋతువు: శరద్ ఋతువు ఆయనం: దక్షిణాయణం విశేషం: అమావాస్య, దీపావళి, నరక చతుర్దశి, లక్ష్మీ పూజాసూర్యోదయం: 6.03 సూర్యాస్తమయం: 5.19 చంద్రోదయం: 5.49 చంద్రాస్తమయం: 4.46 తిథి: బహుళ చతుర్దశి ఉ. 10.26 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: స్వాతి పూర్తిగా ఉంది యోగం: ఆయుష్మాన్ తె. 3.44 వరకు, తదుపరి సౌభాగ్యం కరణం: శకుని ఉ. 10.26 వరకు, తదుపరి చతుష్పాదం రా. 10.43 వరకు, తదుపరి నాగం

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

అభివృద్ధికి ప్రజామోదమే ఈ విజయం

- అందరికీ కృతజ్ఞతలు: చంద్రబాబు
- స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం
- 2024తో పోలిస్తే పెరిగిన ప్రజాదరణ
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 చోట్ల విజయం
- వైఎస్సార్సీపీపై సీఎం విమర్శలు



అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీని మరింతగా తిరస్కరించి, కూటమికి ఘన విజయాన్ని అందించారని తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పట్టణాలు, పల్లెలు, అన్ని వర్గాల ప్రజలు కూటమికి ఒకే విధమైన మద్దతు పలికారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమే ఈ ఫలితాలని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే కూటమికి ప్రజాదరణ మరింత పెరిగిందని చెప్పారు. కేడర్ బేస్ పార్టీ టీడీపీ అని, సేవాభావమే తమ రాజకీయ విధానమని - మిగతా 3లో



ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కీలక ఫోన్ సంభాషణ

- చర్చలు మరియు దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేసిన పీఎంఓ
- శాంతి స్థాపనకు అవసరమైన అన్ని చర్యలకు సహకరించేందుకు భారత్ సిద్ధమని వెల్లడి
- యుద్ధాన్ని ముగించేలా ఇతర దేశాల నేతలతో భారత్ చర్చలు జరపాలని కోరిన జెలెన్స్కీ
- ఆహార భద్రత, ఇంధన రక్షణపై అన్ని పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు జైశంకర్ స్పష్టీకరణ

ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం

- దేశద్రోహి' ఆరోపణలపై రాహుల్ ఫైర్..
- మోదీకి బహిరంగ చర్చకు సవాల్!
- 'ఎవరూ దేశద్రోహులు? విదేశీ శక్తుల చేతుల్లో ఉన్నదెవరు?'
- ఏ సమయంలోనైనా.. ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం
- జవాన్లు ప్రధాని వ్యాఖ్యలను నమ్మలేదంటూ రాహుల్ వ్యాఖ్యలు



డీలిమిటేషన్ బిల్లు కోసమే పార్లమెంట్ ప్రారోగేషన్ ఆలస్యం

- బీజేపీపై కాంగ్రెస్ ఫైర్!
- 88 రోజులైనా ప్రారోగ్ కాని పార్లమెంట్ సమావేశాలు
- మోదీకి ఖర్గే నాలుగు లేఖలు రాసినా స్పందన లేదు
- అమిత్ షాకు సమయం ఇచ్చేందుకే జాప్యమంటూ జైరాం రమేశ్ ఆరోపణ

పదేళ్లలోనే పెను మార్పు.. భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు



- 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిన పేదరికం
- తీవ్ర పేదరికం నుంచి బయటపడిన 49.6 కోట్ల మంది
- భారత్ పురోగతిని ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు
- పేదల్లో 57 శాతం మంది ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోనే
- 2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరిన కుటుంబాల ఖర్చు

వాయిదాల వలయంలో కృష్ణా, గోదావరి బోర్డులు!

- ఆరుసార్లు వాయిదా పడిన కేఆర్ఎంబీ భేటీ
- 20 నెలలుగా జీఆర్ఎంబీ సమావేశం లేదు
- పరిష్కారానికి నోచుకోని కీలక జల సమస్యలు



హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నదీ జలాల వివాదాలకు పరిష్కారం చూపాల్సిన కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు వాయిదాల పర్వంగా మారాయి. కీలక సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన భేటీలు పదేపదే వాయిదా పడుతుండటంతో జల వివాదాల పరిష్కారం మరింత జాప్యమవుతోంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం ఏకంగా ఆరుసార్లు వాయిదా పడగా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు - మిగతా 3లో

88 రోజులుగా ప్రారోగ్ కాని పార్లమెంట్!



- 18 ఏళ్ల రికార్డు బద్దలు..
- 2008 నాటి 87 రోజుల రికార్డు బద్దలు
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల కోసమేనా జాప్యం?
- ప్రారోగేషన్‌పై రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు లేదు

ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్



- ఓపీఎస్‌లోకి మారే అవకాశం!
- అర్హులకు వన్‌టైమ్ ఆప్షన్
- డిసెంబర్ 31లోగా దరఖాస్తు
- జీవో 158 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలో ఉన్న వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ జీవో ఎంఎస్ నంబర్ 158ను విడుదల చేశారు. 2026 జూలై 13న జారీ చేసిన జీవో 53కు అనుగుణంగా ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దిష్ట గడువులో పూర్తి చేసేందుకు సమగ్ర - మిగతా 3లో



ఎర్రకోట పేలుడు తర్వాత ఉగ్రవాదంపై ఉక్కుపాదం

- ఏడాదిలో 300 మందికి పైగా అరెస్టు
- విదేశాల నుంచి 73 మంది మోస్ట్ వాంటెడ్ నిందితుల అప్పగింత
- 'ప్రహార్' వ్యూహంతో నెట్‌వర్క్‌లపై నిఘా
- 'ప్రహార్'తో ఉగ్రవాదంపై ప్రత్యేక వ్యూహం

ఏపీఎండీసీకి ప్రభుత్వం భారీ ఊరట

- మరో రూ.115 కోట్ల అదనపు గ్యారంటీ!
- బొగ్గు గనుల వేలంలో మరింత చురుగ్గా పాల్గొనేందుకు అవకాశం
- రుణ గ్యారంటీ పరిమితి రూ.1,021.52 కోట్లకు పెంపు
- అదనపు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

APMDC
dhra Pradesh Min
Development Corp

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మైనింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి మరో రూ.115 కోట్ల అదనపు ప్రభుత్వ గ్యారంటీని మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించే బొగ్గు గనుల వేలంలో సంస్థ మరింత చురుగ్గా పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ - మిగతా 3లో

ఎస్ కే పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా బ్రిక్స్ వారోత్సవాలు

గుంతకల్లు నవంబర్ 9 (ప్రజా జ్యోతి): స్థానిక ఎస్ కె పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్ స్టైల్ వీక్ (నవంబర్ 1 నుండి 7 వరకు 2026) వారోత్సవాల ను నవంబర్ 1వ తేదీ నుండి ఏడవ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకృతికి హాని కలిగించని జీవన విధానాన్ని అలవర్చు కోవడం. బ్రిక్స్ దేశాలలో ఒకటైన మన భారతదేశం అధ్యక్షతన జరుగుతున్న ఈ కార్యక్రమం లో కేంద్ర ప్రభుత్వ మిషన్ లైఫ్ లక్ష్యాలకు అనుగుణంగా ఏడు రోజులు నవంబర్ 1వ తేదీ నుండి ఏడవ తేదీ వరకు ఒక్కో పర్యావరణ అంశంపై అవగాహన కల్పించడం. నవంబర్ 1వ తేదీన ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవ డం, నవంబర్ రెండవ తేదీన విద్యుత్ శక్తి ని ఆదా చేయడం, నవంబర్ మూడ వ తేదీన నీటిని సంరక్షించ డం, నవంబర్ 4వ తేదీన స్థిరమైన మరియు సహజ మైన ఆహార విధానాలను పాటించడం, నవంబర్ 5వ తేదీన ఒక్కసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్ దూరంగా ఉండటం, నవంబర్ ఆరవ తేదీన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించ డం మరియు సరిగ్గా నిర్వహించడం, చివరి రోజున నవంబర్ ఏడవ తేదీన సాధారణ వ్యర్థాలను తగ్గించడం. ఈ వారోత్స వాల ముఖ్య ఉద్దేశం కేవలం నినాదాలు చేయడం కాదు ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవ డం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వాములు కావడం. ఈ కార్యక్రమా లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మ



య్య ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ శర్మ, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కే హనుమంత రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేట ర్ డాక్టర్ పవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు నీలం నారాయణ, డాక్టర్ కే రవిశంకర్, ఈగల్ క్లబ్ కోఆర్డినే టర్ ఉమర్ షరీఫ్, సాసా కోఆర్డినేటర్ అల్తాఫ్, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ శ్రీ భీమ లింగయ్య, అధ్యాపక అధ్యా పకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఈ ఏడు రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

పంచాయతీ సర్పంచికి వార్డు సభ్యుడికి గుర్తులు సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్.



సర్పంచ్ కు 25 గుర్తులు, వార్డు సభ్యుడికి 20 గుర్తులు.

నంద్యాల:నవంబర్=09 ప్రజాజ్యోతి గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఈ నెల 26, 29, డిసెంబరు 2వ తేదీల్లో జరగనున్నా యి. ఇందులో భాగంగా సర్పంచి అభ్యర్థుల కోసం 25, వార్డు సభ్యుల కోసం 20 చొప్పున గుర్తులు కేటాయించా రు. వీటికి అదనంగా నోటా ఉండనుంది. అభ్యర్థుల సంఖ్య పెరిగితే కొత్త గుర్తులు కేటాయించనున్నారు.

సర్పంచ్ గుర్తులు ఇవే..

మంచం, కత్తెర, ఉంగరం, బుట్ట, వంకాయ, కప్పూ సాసరు, క్యారెట్, తాళం చెవి, గొలుసు, కుర్చీ, బ్యాట్, టెలిఫోన్, బల్ల, మొక్కజొన్న, పలక, ద్రాక్షపళ్లు, తిరగలి, కుండ, అరటిపండు, కొవ్వొత్తులు నల్లబోర్డు, అనాసపండు, షటిల్, చేతికర్ర, చెంచా.

వార్డు సభ్యుల గుర్తులు..

ప్రెషర్ కుక్కర్, గౌను, స్టూల్, ఇస్త్రీపెట్టె, పోస్ట్ డబ్బా, గ్యాస్ స్టౌ, బీరువా, ఐస్క్రీమ్, కెటిల్, కటింగ్ ప్లేయర్, విద్యుత్ స్తంభం, గరాటా, డిష్ యాంటెన్నా, రంపం, కెమెరా, క్యారమ్ బోర్డు, వయో లిన్, బెండకాయ, బెల్టు, కోటు గుర్తులు.

బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారి స్వగృహం నందు బాణాసంచా కాల్చి దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ





బనగానపల్లె:నవంబర్=09 ప్రజాజ్యో తి చీకటిని తొలగించి వెలుగులు నింపే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త ఆశలు, ఆనం దాలు, సుఖసంతోషాలు నింపాలని చెడుపై మంచి సాధించిన విజయా నికి ప్రతీకగా జరుపుకునే ఈ దీపావ ళి పర్వదినం ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు విరజిమ్మాలి....ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సిరిసంపదలు వెల్లివిరి యాలని ఆకాంక్షిస్తూ...బనగానపల్లె నియోజకవర్గం ప్రజలకు, వైఎస్సార్సీ పీ నాయకులకు, కార్యకర్తలకు అధి కారులకు, అనధికారులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ

నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం



కోవెలకుంట్ల:నవంబర్=09 ప్రజాజ్యోతి కార్తీకమాసం నేటినుంచి ప్రారంభం కానుంది. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే ఈ మాసంలో పలు పర్వదినాలు రానున్నాయి. నవంబర్ 13న నాగుల చవితి, 16న తొలి కార్తీక సోమవారం, 21న క్షీరాబ్ధి ద్వాదశి, 23న రెండో కార్తీక సోమవారం, 24న కార్తీక పౌర్ణమి జరగనున్నాయి. అలాగే నవంబర్ 30న మూడో సోమవారం, డిసెంబర్ 7న నాలుగో కార్తీక సోమవారం వస్తాయి. డిసెంబర్ 8తో కార్తీకమాసం ముగియనుంది అని వేదపండితుడు తంబల్ల మహేశ్వరయ్య తెలిపారు

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజల కోసం పనిచేసే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు వై కాపా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

: మాజీ ఎమ్మెల్యే వైవిఆర్

గెలుపొందిన కౌన్సిలర్లతో పాటు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన అభ్యర్థులకు ఘన సన్మానం



గుంతకల్లు నవంబర్ 9 (ప్రజా జ్యోతి): మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి కౌన్సిలర్లుగా విజయం సాధించిన అభ్యర్థులతో పాటు, స్వల్ప ఓట్ల తేడా తో ఓటమి చెందిన వైఎస్సార్సీపీ అభ్యర్థులను గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. వెంకటరామి రెడ్డి, వైఎస్సార్సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి అభ్యర్థులకు శాలువా లు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన అభ్యర్థులు నిరుత్సాహప డకుండా ప్రజలతో నిరంతరం మమేకమై ప్రజాసేవను కొన సాగించాలని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమ ని, ప్రజల కోసం పనిచేసే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగం హాస్టల్ విద్యార్థులకు టపాసులు పంపి వారి కళ్ళలో ఆనందం చూసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నంద్యాల:నవంబర్=09 ప్రజాజ్యోతి దీపావళి పండుగను పురస్కరించుకొని నంద్యాల వై ఎస్ ఆర్ నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయంలోని బుడగ జంగం హాస్టల్ చిన్నారులకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి దీపావళి టపాసులు పంపించి హాస్టల్ విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు నింపి, వారి కళ్ళలో ఆనందం చూశారు.చిన్నారులు ఎంతో ఆనందం గా దీపావళి జరుపుకుంటూ ఎంపీ గారికి హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. బేడ బుడగ జంగం సంచార జాతీ చిన్నారుల సంతోషమే తనకు నిజమైన పండుగ, ఆనందమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు. ఎంతో విశిష్టమైన, ఆనందాల దీపావళి పండుగకు తమకు టపాసులు పంపి మమ్మల్ని ఆనందపరిచిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి నంద్యాల వై ఎస్ ఆర్ నగర్ లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదివాసీయ విద్యాలయం (హాస్టల్) నిర్వాహకులు గడ్డం. సుబ్బారాయుడు, హాస్టల్ వార్డన్ నాగలక్ష్మి, రాజేశ్వరమ్మ, లక్ష్మిదేవి, సిబ్బంది సౌజన్య, సరోజ, లక్ష్మి, రాధా, హాస్టల్ విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



నంద్యాలలోని బేడ బుడగ జంగం హాస్టల్ విద్యార్థుల ఆనందం

కూటమి ప్రభుత్వం పనితీరుకు స్థానిక ఎన్నికలలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

పాలకొల్లు. నవంబర్.9. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పనితీరు కు, అభివృద్ధి, సంక్షేమానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. పేర్కొన్నారు. పాలకొల్లులో మంత్రివర్యుల కార్యాలయం వద్ద జరిగిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రజలు విజ్ఞతతో ఓటేసి, పనిచేసే ప్రభుత్వంపై అపార విశ్వాసాన్ని మరోసారి స్థానిక సంస్థల ఎన్నికలలో ఓట్ల రూపంలో చూపించారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబల్ ఇంజన్ సర్కార్ ను, స్థానిక సంస్థల ఎన్నికల తీర్పుతో త్రిబుల్ ఇంజన్ సర్కార్ గా మార్చారన్నారు.కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు మహిళా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వటంతో మహిళలు సంతృప్తిగా ఉన్నట్లు కూటమి అభ్యర్థుల విజయ దుందుభిని బట్టి తెలుస్తున్నదన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ విజయాన్ని గుండెల్లో పెట్టుకుని రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశలో పయనించేలా కూటమి ప్రభుత్వం చూస్తుందన్నారు. నరకాసుర వధ అనంతరం దీపావళి సంబరాలు జరుపుకోవటానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో గోడ్డలి పార్టీకి సమాధి కట్టిన ఈ దీపావళికి దగ్గర పోలిక ఉందని మంత్రి నిమ్మల అన్నారు. గొడ్డలి పార్టీ ని 11సీట్లకే పరిమితం చేసినా రప్పా రప్పా అంటూ తన అరాచకాలు మానలేదన్నారు. వైకాపా గొడ్డలి పార్టీ పైన, ఆ పార్టీ అరాచకం, అకృత్యాల పైన ప్రజలు నిరసన గళం వినిపించారన్నారు. గొడ్డలి పార్టీ



రాజకీయాల్లో ఉన్నంతకాలం తమకు, శాంతి భద్రతలు ఉండ వని ప్రజలు బలంగా నమ్మి అరాచకాలు, విష సంస్కృతితో, రప్పా రప్పా అంటూ రక్తం పారించే గోడ్డలి పార్టీకి శాశ్వతంగా సమాధి కట్టారన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో 3 జడ్పీటీసీలు, 40ఎంపీటీసీ కూటమి అభ్యర్థులకు విజయం చేకూర్చారని ఈ విజయాన్ని నియోజకవర్గం ప్రజలకు అంకితం చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

నూతన చైర్‌పర్సన్ యశోదమ్మ గౌడ్ ని సన్మానించిన దివ్యాంగుల హక్కుల పోరాట సాధన సమితి



గుంతకల్లు నవంబర్ 9 (ప్రజా జ్యోతి): గుంతకల్లు మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యశోదమ్మ గౌడ్ ని ఆదివారం దివ్యాంగుల హక్కుల పోరాట సాధనా సమితి అధ్యక్షురాలు పద్మ ఆధ్వర్యంలో సభ్యులు చైర్మన్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల పోరాట సాధనా సమితి అధ్యక్షురాలు గుంతకల్లు పద్మ మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలోని దివ్యాంగులు ఎదుర్కొం టున్న సమస్యలను చైర్‌పర్సన్ ప్రత్యేక దృష్టితో పరిశీలించి తక్షణమే పరిష్కరించా లని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి దివ్యాంగులకు అందే లా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నూతన చైర్‌పర్సన్ దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు గౌరీ, శోభ, సురేంద్ర, జఫ్రుల రాజు, కమల తదితరులు పాల్గొన్నారు.

దమ్మున్న నాయకుడు కావాలంటే... ముందుగా మనలో మార్పు రావాలి మిత్రమా!

బనగానపల్లె:నవంబర్=09 ప్రజాజ్యోతి మన ఊరు మారాలి, మన బతుకులు మారాలి, మన పిల్లల భవిష్యత్తు బాగుండాలి అని కోరుకుంటాం. కానీ ఓటు వేసే సమయంలో మాత్రం డబ్బులకు, మద్యం సీసాలకు మన ఓటు హక్కును అమ్ముకుంటే మార్పు ఎలా వస్తుంది మిత్రమా? మనకు కావాల్సింది ఎన్నికల సమయంలో కనిపించే నాయకుడు కాదు... ఐదేళ్లూ ప్రజల మధ్య ఉండి, ప్రజల కష్టాల్లో తోడుగా నిలబడి, మన సమస్యలపై ప్రశ్నించే నిజాయితీ గల నాయకుడు.ఒక్కసారి ఆలోచించండి... మనం తీసుకునే చిన్న ప్రయోజనం కోసం మన ఊరి భవిష్యత్తును తాకట్టు పెడుతున్నామా? మన ఓటు విలువ కొన్ని నోట్లకా? ఒక మద్యం సీసాకా? కాదు మిత్రమా... మన ఓటు మన హక్కు, మన భవిష్యత్తు, మన పిల్లల రేపటి జీవితం! నాయకుడిని ప్రశ్నించే దమ్ము మనకు రావాలంటే... ముందుగా నాయకుడిని ఎన్నుకునే విషయంలో మనకు నిజాయితీ ఉండాలి.డబ్బులు ఇచ్చేవాడిని కాదు... అభివృద్ధి చేసేవాడిని ఎన్నుకుందాం. మాటలు చెప్పేవాడిని కాదు... చేతల్లో చూపించేవాడిని నిలబెడదాం.మార్పు కోసం మరొకరిని నిందించడం కాదు... మార్పును మన నుంచే ప్రారంభిద్దాం. గుర్తుంచుకోండి మిత్రమా... మన ఓటు అమ్ముడుపోతే మన గొంతు కూడా అమ్ముడుపోయినట్టే!

మన ఓటు -- మన హక్కు
మన నిర్ణయం -- మన ఊరి భవిష్యత్తు.
మన మార్పు -- మన చేతుల్లోనే ఉంది!
ఒక్కసారి కాదు... వందసార్లు ఆలోచించి ఓటు వేయండి.



జై ప్రజాస్వామ్యం... జై గ్రామాభివృద్ధి! ??

అభివృద్ధికి ప్రజామోదమే ఈ విజయం

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కూటమిగా కలిసి పనిచేశామని, అన్ని జిల్లాల్లోనూ ప్రజలు తమకు మద్దతు పలికారని తెలిపారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ప్రజా మద్దతు లభించలేదని వ్యాఖ్యానించారు. విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో స్వర్ణాంధ్ర విజన్‌ను రూపొందించి అభివృద్ధి, సుపరిపాలన కోసం కృషి చేస్తున్నామని వివరించారు.

2024తో పోలిస్తే పెరిగిన ప్రజాదరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజాదరణ పెరిగిందని ఓట్ల శాతమే స్పష్టం చేస్తోందని చంద్రబాబు తెలిపారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి కూటమి 58.9 శాతం ఓట్లు సాధించిందని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఆదరణ పెరిగిందని వివరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి, వైఎస్సార్సీపీకి మధ్య ఓట్ల శాతంలో 25.34 శాతం వ్యత్యాసం ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎన్డీఏకు 59.9 శాతం, వైఎస్సార్సీపీకి 34.3 శాతం ఓట్లు వచ్చాయని, కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా నమోదైందని చెప్పారు. జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ 57.6 శాతం, వైఎస్సార్సీపీ 39.7 శాతం ఓట్లు సాధించాయని తెలిపారు. పట్టణాల్లో కూటమి, వైఎస్సార్సీపీ మధ్య ఓట్ల శాతం వ్యత్యాసం 25.60 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందన్నారు. మొత్తం 9,818 ఎంపీటీసీ స్థానాలకు గానూ కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను దక్కించుకుందని వెల్లడించారు.

27 జిల్లాల్లో కూటమి ఆధిక్యం

మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గానూ కూటమి 575 స్థానాలను గెలుచుకుందని చంద్రబాబు తెలిపారు. 28 జిల్లాల్లో 27 చోట్ల ఆధిక్యత సాధించిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైఎస్సార్సీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుందని చెప్పారు. ఏడు జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదని వివరించారు. పట్టణాల్లో ఎన్డీఏకు 65.7 శాతం, వైఎస్సార్సీపీకి 27.42 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయని తెలిపారు. పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైఎస్సార్సీపీకి 31.46 శాతం ఓట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీ ఖాతా తెరవలేదని చంద్రబాబు వెల్లడించారు.

పెట్టుబడులు, అభివృద్ధికి ప్రాధాన్యం

పెట్టుబడులను ఆకర్షించేలా ఎస్ఐపీబీ, కేబినెట్ సమావేశాల ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేశామని చంద్రబాబు తెలిపారు. వివిధ శాఖల ప్రగతి నివేదికలను ప్రజల ముందు ఉంచామని చెప్పారు. రాయలసీమను అభివృద్ధి సీమగా మార్చే లక్ష్యంతో నీటిని అందించడంతో పాటు పరిశ్రమలను తీసుకొస్తున్నామని వివరించారు. సూపర్ ఎల్‌నినో వంటి తీవ్ర కరవు పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరవు, కోస్తాంధ్రలో తుపాన్ల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పటికీ సాంకేతిక పరిజ్ఞానంతో ముందస్తు అంచనాలు వేసి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ప్రభుత్వం అండగా నిలిచిందని, అందుకే ఎన్నికల్లో ప్రజలు కూటమికి మద్దతు పలికారని పేర్కొన్నారు.

మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం

టీడీపీ తరఫున మేయర్లు, చైర్‌పర్సన్లుగా గెలిచిన 70 మందిలో 55 మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగినవారని చంద్రబాబు తెలిపారు. వీరిలో 42 మంది మహిళలు ఉండగా, 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారని చెప్పారు. టీడీపీ గెలుచుకున్న పది మేయర్ పదవుల్లో ఎనిమిది మంది మహిళలే ఉన్నారని వివరించారు. రాజకీయాల్లో తాము చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలనిచ్చాయని, ఈ నాయకత్వం భవిష్యత్తులో మరో 30 ఏళ్లకు సరిపడే నాయకులను అందిస్తుందని అన్నారు.

పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి హవా

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించిందని చంద్రబాబు తెలిపారు. 100 స్థానాలకు గానూ 94 చోట్ల విజయం సాధించి, 82 శాతం వార్డులను కైవసం చేసుకుందని వెల్లడించారు. మొత్తం 3,941 వార్డుల్లో 3,233 స్థానాలను గెలుచుకున్నామని, 13 మేయర్ పదవులకు గానూ 12, 87 చైర్‌పర్సన్ పదవులకు గానూ 82 దక్కించుకున్నామని చెప్పారు. టీడీపీ 70, జనసేన 20, బీజేపీ నాలుగు చొప్పున మేయర్, చైర్‌పర్సన్ పదవులను సాధించాయని వివరించారు. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కౌన్సిల్ మెజారిటీ సాధించామని, 16 పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని వార్డులనూ కూటమి గెలుచుకుందని తెలిపారు. అనంతపురం మేయర్ అభ్యర్థి ఓడిపోయినప్పటికీ కార్పొరేటర్లలో కూటమి బలం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.

పులివెందులలోనూ కూటమి విజయధంకా

విశాఖలో 2,47,817, విజయవాడలో 1,30,872, గుంటూరులో 96,294 ఓట్ల మెజారిటీ సాధించామని చంద్రబాబు వెల్లడించారు. వైఎస్సార్సీపీ 100 పట్టణ స్థానిక సంస్థలకు గానూ కేవలం నాలుగు చోట్లే గెలిచిందని, 13 మేయర్ పదవుల్లో ఒక్కటి మాత్రమే దక్కించుకుందని చెప్పారు. మొత్తం 3,941 వార్డుల్లో 558 స్థానాలకే పరిమితమైందని, 22 పట్టణ స్థానిక సంస్థల్లో ఒక్క వార్డును కూడా గెలుచుకోలేకపోయిందని తెలిపారు. పులివెందులలో కూటమి 13,875 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్ పదవిని దక్కించుకుందని, 40 వార్డులకు గానూ 37 స్థానాలను గెలుచుకుందని వివరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అన్నారు. కడప జిల్లాలో రౌడీ రాజకీయం అంతమైందని, అక్కడి తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలూ కూటమి ఖాతాలో చేరాయని వ్యాఖ్యానించారు.

యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీకి రెండో స్థానం

ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయనడానికి యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీ సాధించిన స్థానమే నిదర్శనమని చంద్రబాబు తెలిపారు. 2026 సూచీలో 28 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. జీవన ప్రమాణాలు, సామాజిక-ఆర్థిక భద్రత, మౌలిక వసతులు, విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుతున్నాయని వివరించారు. కుటుంబ స్థాయి నుంచి కమ్యూనిటీ ఆస్తుల వరకు పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాల నిర్మాణంలో ఏపీ ముందంజలో ఉందన్నారు.

వైఎస్సార్సీపీ హింసాత్మక రాజకీయాలపై విమర్శలు

హింస, దాడులు, హిట్ అండ్ రన్ రాజకీయాలతో ప్రజాతీర్పును మార్చలేరని చంద్రబాబు వైఎస్సార్సీపీపై విమర్శలు గుప్పించారు. 'గొడ్డలి పార్టీ' రాజకీయాలకు కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. విశాఖకు తమ ప్రభుత్వం అభివృద్ధి వెలుగులు తీసుకొస్తే, మేయర్ స్థానంలో 2.50 లక్షల ఓట్ల మెజారిటీతో ప్రజలు కూటమిని గెలిపించారని అన్నారు. ప్రజల కోసం కష్టపడే పార్టీల వెంటే ప్రజలు ఉంటారని ఈ ఎన్నికలతో మరోసారి నిరూపితమైందని చెప్పారు. కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ అన్ని విధాలా ప్రయత్నించిందని చంద్రబాబు ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ ప్రక్రియ, డీలిమిటేషన్‌పై పిటిషన్లు వేసిందని, అయితే సుప్రీంకోర్టు వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసిందని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ నేరాలు, ఘోరాలు, హింసాత్మక రాజకీయాలనే నమ్ముకుందని విమర్శించారు. రౌడీ రాజకీయాలు, డ్రామాలతో ప్రజాతీర్పును మార్చలేరని అన్నారు. రెండు తుపాన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ వైఎస్సార్సీపీ కనీసం రాజకీయ పార్టీగా స్పందించలేదని చంద్రబాబు విమర్శించారు. తాము ఎన్నికల కంటే తుపాన్లు, ప్రజా సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెట్టి పనిచేశామని తెలిపారు. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఓటర్లు కూటమికి మద్దతు పలికారని చెప్పారు. రాజకీయ పార్టీలకు ప్రజల దీవెనల కంటే గొప్ప బహుమతి మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు.

ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

-మొదటిపేజీ తరువాయి

మార్గదర్శకాలను రూపొందించారు.

ఎవరెవరికి అవకాశం?

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామక నోటిఫికేషన్ విడుదలై, ఆ తర్వాత నియామకం పొంది ప్రస్తుతం సీపీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులు ఓపీఎస్‌ను ఎంచుకోవడానికి అర్హులు. అంటే నోటిఫికేషన్ తేదీ 2004 సెప్టెంబర్ 1 కంటే ముందుండి, నియామకం ఆ తేదీన లేదా ఆ తర్వాత జరిగిన ఉద్యోగులకు ఈ అవకాశం వర్తిస్తుంది. ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్న అర్హులైన ఉద్యోగులతో పాటు, ఇప్పటికే పదవీ విరమణ చేసినవారు, ఫ్యామిలీ పెన్షన్ పొందుతున్న అర్హులైన లబ్ధిదారులు కూడా ఈ ఒక్కసారి ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇందుకోసం అర్హులైన వారు 2026 డిసెంబర్ 31లోగా తమ ఐచ్ఛికాలను సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేంద్ర మార్గదర్శకాల ఆధారంగా నిర్ణయం

కేంద్ర ప్రభుత్వ పరిధిలో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అమల్లోకి రాకముందే నియామక ప్రక్రియ ప్రారంభమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఎంచుకునే అవకాశం కల్పిస్తూ కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ 2020--2023 మధ్య పలు కార్యాలయ మెమోరాండంలను జారీ చేసింది. అదే విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని కల్పిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.

దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక ఆదేశాలు

ఈ ప్రక్రియను పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. సంబంధిత నియామక అధికారులు, కార్యాలయ అధిపతులు అందిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించాలని ఆదేశించింది. అవసరమైన రికార్డులను పక్కాగా నిర్వహించి, అర్హతలను నిర్ధారించాలని సూచించింది. సచివాలయ విభాగాలు, హెచ్ఓడీలు, ట్రెజరీ అధికారులు ఈ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్దేశిత గడువులోగా అర్హులైన ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలను ఖరారు చేయాలని స్పష్టం చేసింది. జీవోకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని ఆర్థికశాఖ తెలిపింది.

ఏపీఎండీసీకి ప్రభుత్వం భారీ ఊరట..

-మొదటిపేజీ తరువాయి

ఈ నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వులతో ఏపీఎండీసీకి ఉన్న మొత్తం రుణ గ్యారంటీ పరిమితి రూ.906.52 కోట్ల నుంచి రూ.1,021.52 కోట్లకు పెరిగింది.

గతంలో రూ.906.52 కోట్లకు అనుమతి

2025 ఏప్రిల్‌లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. వాణిజ్య బ్యాంకులు, ఆర్థిక సంస్థలు లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి నాన్-ఫండ్ ఆధారిత పరిమితుల కింద రూ.906.52 కోట్ల వరకు రుణ సదుపాయం పొందేందుకు ఏపీఎండీసీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. తాజాగా సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) సమర్పించిన ఈ-ఫైల్ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం మరో రూ.115 కోట్ల గ్యారంటీని మంజూరు చేసింది.

అసలు, వడ్డీకి ప్రభుత్వ గ్యారంటీ

ఈ గ్యారంటీ రుణం పూర్తి కాలానికి వర్తించనుంది. రుణ అసలుతో పాటు వడ్డీ చెల్లింపులకు కూడా ప్రభుత్వ హామీ ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే రుణం, వడ్డీ చెల్లింపుల బాధ్యత పూర్తిగా ఏపీఎండీసీదేనని ప్రభుత్వం పేర్కొంది.

5 శాతం గ్యారంటీ కమిషన్

రుణాన్ని ముందస్తుగా చెల్లించే అవకాశం ఉండేలా ఆర్థిక సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాల్లో జీరో ఫోర్‌క్లోజర్ ఛార్జీల నిబంధన ఉండేలా చూసుకోవాలని ఏపీఎండీసీకి సూచించింది. ప్రభుత్వం కల్పించిన గ్యారంటీపై సంస్థ ఏటా 5 శాతం చొప్పున గ్యారంటీ కమిషన్‌ను ప్రభుత్వానికి చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు ఏపీఎండీసీకి అదనపు ఆర్థిక బలం చేకూరనుంది.

ఏపీలో వరుస ఎన్నికలు...

విజయవాడ : ఏపీలో వరసగా ఎన్నికలు జరుగుతున్నాయి. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇప్పటికే ముగిశాయి. దీంతో ప్రభుత్వం మిగతా పంచాయతీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికలపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అధికారులు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను కూడా ఇవ్వడం జరిగింది.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందడి నెలకొంది. ముందు మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా.. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. వీటికి సంబంధించిన ఫలితాలు కూడా వచ్చేశాయ్. దీంతో మిగిలిన ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ని ఖరారు అయింది. ఇక ప్రాథమి వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈ ఎలక్షన్‌ని ఒకే విడతలో నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు శనివారం జిల్లా సహకార అధికారులకు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను జారీ చేశారు.అలాగే ఈ ఎలక్షన్ పనుల్లో ఎలాంటి ఆలస్యం, నిర్లక్ష్యం సహించేది లేదని కమిషనర్ తెలిపారు. కిందిస్థాయి అధికారులకు, ఎంప్లాయీస్‌కి ఎన్నికల నిర్వహిణతో పాటు చట్టపరంగా ఉన్న నిబంధనలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాదు ఆదేశాలు అందిన పది రోజుల్లోగా వెంటనే సంబంధిత కార్యాచరణపై రిపోర్ట్ అందించాలని తెలియజేశారు. దీంతోపాటు రైతు సేవా కేంద్రాల వారీగా ప్రాథమిక ఓటర్ల లిస్ట్‌లను రెడీ చేసి, 'ఈ-పీఏసీఎస్ ఈఆర్‌పీ' పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా ఓటర్లకు అనుకూలంగా ఉండే పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ముందుగానే అంచనాకు రావాలని సూచించడం జరిగింది.ఈ కోపరేటివ్ సోసైటీ ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. కాబట్టి దీనికి తగ్గట్టుగా బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి, ప్రింటింగ్ ప్రెస్‌ల లభ్యతపై ముందస్తు ప్లాన్ చేసుకోవాలని కమిషన్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించి, చట్టపరమైన విషయాలపై పట్టున్న అధికారులను నియమించాలని చెప్పారు. దీంతోపాటు పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు ట్రైనింగ్ ఇవ్వాలని, ఇతర శాఖల ఉద్యోగుల వివరాలను సేకరించాలని కూడా సూచించారు. ఎన్నికల నిర్వహణకయ్యే ఖర్చులను అంచనా వేయాలని అలాగే శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించాలని సంబంధిత మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. ఆ ఎన్నికలు వచ్చే నెల మొదటి వారంలోనే పూర్తి కానున్నాయి.

గ్రామాల్లో సందడి

రాష్ట్రంలో 13 వేల 219 పంచాయతీలకు పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. ఈ నెల 13వ తేదీన ఎన్నికల షెడ్యూల్‌2ని అధికారికంగా రిలీజ్ చేయనున్నట్టు ఎఇఇ ప్రకటించింది. దీంతో మళ్లీ పొలిటికల్ హీట్ ఎక్కింది.పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో జరగనున్నాయి. ఈ మేరకు నవంబర్ 13న మొదటి దశ, 16న రెండో దశ, 19వ తేదీన మూడో దశకు నోటిఫికేషన్లను జారీ చేయనున్నారు. తొలివిడతలో భాగంగా నోటిఫికేషన్ 13న విడుదలైతే.. నవంబర్ 17వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి.. ఫలితాలను వెల్లడించడం జరుగుతుంది. రెండో విడతలో భాగంగా 16న నోటిఫికేషన్ రిలీజ్ చేస్తారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 20. ఇక నవంబర్ 29న పోలింగ్, ఫలితాలు వెల్లడిస్తారు. అలాగే మూడో విడత నోటిఫికేషన్ 19న విడుదల కాగా.. నవంబర్ 23 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. ఫైనల్ పోలింగ్, ఫలితాలను డిసెంబర్ 2వ తేదీన వెల్లడించడం జరుగుతుంది.రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు చాలా కీలకంగానే ఉంటాయి. గ్రామాల్లో ఈ ఎన్నికల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తికరంగా ఉంటారు. ఈ పంచాయతీ ఎన్నికలు అధికారికంగా పార్టీల గుర్తులపై జరగకపోయినా.. కూటమి, వైసీపీ మద్దతుదారుల మధ్యే పోటీ తీవ్రంగా ఉంటుంది. రాష్ట్రంలో కొత్త గవర్నమెంట్ ఏర్పాటైన తర్వాత జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో అధికార, ప్రతిపక్షాలకు ఇవి అత్యంత కీలకం కానున్నాయి. మొత్తానికి పల్లె పోరుకు సిద్ధమైంది.

వాయిదాల వలయంలో కృష్ణా, గోదావరి బోర్డులు!

-మొదటిపేజీ తరువాయి

(జీఆర్ఎంబీ) సమావేశం కూడా పలుమార్లు వాయిదా పడింది. దీంతో రెండు నదులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చలు ముందుకు సాగడం లేదు.

వాయిదాల వలయంలో సమావేశాలు

రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల నిర్వహణ, టెలిమెట్రీ వ్యవస్థల ఏర్పాటు వంటి కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన బోర్డుల సమావేశాలే నిర్వహణకు నోచుకోవడం లేదు. భేటీల నిర్వహణకు నిర్ణయాలు తీసుకుంటున్నా, వివిధ కారణాలతో వాయిదాలు పడుతుండటంతో జల వివాదాలపై అనిశ్చితి కొనసాగుతోంది.

ఆరుసార్లు వాయిదా పడిన కేఆర్ఎంబీ భేటీ

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు 21వ సమావేశం నిర్వహణలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. తొలుత మే నెలలో నిర్వహించాలని నిర్ణయించిన ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కారణంగా వాయిదా పడింది. అనంతరం ఆగస్టు, అక్టోబర్ నెలల్లో నిర్వహించాల్సిన భేటీలు కూడా జరగలేదు. అక్టోబర్ 26న సమావేశం జరగాల్సి ఉండగా, తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణ అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రితో రాష్ట్ర ప్రభుత్వ సమావేశం ఉన్నందున వాయిదా పడింది. మరుసటి రోజు నిర్వహించాల్సిన భేటీ కూడా జరగలేదు. ఆ తర్వాత నవంబర్ 5న జరగాల్సిన సమావేశం సైతం వాయిదా పడింది. మురసు తుపాను ప్రభావంతో అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేయాలని ఏపీ కోరగా, బోర్డు అంగీకరించింది. ఇలా కేఆర్ఎంబీ 21వ సమావేశం ఆరుసార్లు వాయిదా పడినట్లు సమాచారం.

పూర్తిస్థాయి భేటీకి 22 నెలల విరామం

కృష్ణా బోర్డు పూర్తిస్థాయి సమావేశం చివరిసారిగా 2025 జనవరి 21న జరిగింది. అదే ఏడాది జూన్ 27న ఉద్యోగుల వేతనాల రికవరీకి సంబంధించి హైకోర్టు తీర్పుపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశం మాత్రమే నిర్వహించారు. అయితే అది పూర్తిస్థాయి సమావేశం కాదు. దీంతో కీలక జల సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు బోర్డు భేటీ జరగక చాలాకాలం గడిచింది.

20 నెలలుగా జీఆర్ఎంబీ సమావేశం లేదు

కృష్ణా బోర్డు తరహాలోనే గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు కూడా వాయిదాల బాట పట్టాయి. జీఆర్ఎంబీ



18వ సమావేశాన్ని తొలుత ఆగస్టు 18న నిర్వహించాలని నిర్ణయించారు. అయితే తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేయడం, అజెండా అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తడంతో సమావేశం వాయిదా పడింది. ఆ తర్వాత అక్టోబర్ 30న నిర్వహించాల్సిన భేటీ కూడా మరోసారి వాయిదా పడింది.

జీఆర్ఎంబీ సమావేశం చివరిసారిగా 2025 ఏప్రిల్ 7న జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు మరో సమావేశం నిర్వహించలేదు. గోదావరి బోర్డు పరిధిలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను చర్చించాలన్న ఏపీ ప్రతిపాదనలపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో సమావేశం నిర్వహణలో జాప్యం కొనసాగుతోంది.

ప్రాజెక్టులపై రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు

ఇప్పటికే కేంద్ర జల సంఘం, సాంకేతిక సలహా మండలి అనుమతులు పొందిన ప్రాజెక్టులను తిరిగి చర్చించడం సమంజసం కాదన్నది తెలంగాణ వాదన. మరోవైపు, గోదావరి బోర్డు పరిధిలోని ప్రాజెక్టుల అంశాలను అజెండాలో చేర్చాలని ఏపీ కోరుతోంది. ఈ అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు ముందుకు సాగడం లేదు. కృష్ణా బోర్డు పరిధిలోనూ నీటి పంపిణీ, ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగం, టెలిమెట్రీ వ్యవస్థల ఏర్పాటు వంటి అంశాలపై విభేదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణకు సంబంధించిన అభ్యంతరాలు, డిమాండ్లను బోర్డు సమావేశాల్లో చర్చించి పరిష్కరించాల్సి ఉంది. అయితే సమావేశాల నిర్వహణలో జాప్యం కారణంగా కీలక అంశాలపై చర్చలు, నిర్ణయాలు వాయిదా పడుతున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారం కోసం బోర్డుల భేటీలు ఎప్పుడు జరుగుతాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

పరిషత్ ఎన్నికల్లో అంచనాలు తారుమారు...

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి పార్టీలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో కనిపించిన ఆధిపత్యం పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఉత్తరాంధ్ర నుంచి కోస్తాంధ్ర వరకు, గోదావరి జిల్లాల నుంచి రాయలసీమ వరకు కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. అధికారికంగా పార్టీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు టికెట్లు దక్కక స్వతంత్రులుగా పోటీ చేసిన కూటమి నాయకులు కూడా గెలవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా కనిపించింది.సాధారణంగా ఒకే పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉంటే ఓట్లు చీలిపోయి ప్రత్యర్థి పార్టీకి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. ఈ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి తమకు అనుకూలిస్తుందని వైసీపీ నాయకత్వం ఆశించి ఉండవచ్చు. అయితే ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి. అధికారిక అభ్యర్థితో పాటు రెబల్‌గా పోటీ చేసిన నాయకుల్లో ఒకరిని ఓటర్లు ఆదరించారు. కొన్ని ప్రాంతాల్లో ఇద్దరు కూటమి అభ్యర్థుల మధ్య పోటీ ఉన్నప్పటికీ వైసీపీకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కలేదు.నెల్లూరు జిల్లాలోని ఇందుకూరుపేట, జలదంకి, ఆత్మకూరు, వెంకటాచలం మండలాల్లో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వీరంతా తెలుగుదేశం పార్టీనుంచి టికెట్ ఆశించి, అవకాశం దక్కకపోవడంతో స్వతంత్రులుగా బరిలోకి దిగినవారే కావడం గమనార్హం. శ్రీకాకుళం జిల్లాలోనూ రెబల్ అభ్యర్థుల ప్రభావం స్పష్టంగా కనిపించింది. అక్కడ ఏకంగా 16 మంది స్వతంత్రులు గెలుపొందగా, వారిలో అత్యధికులు టీడీపీకి చెందినవారే కావడం పార్టీ స్థానిక బలాన్ని సూచిస్తోంది.

నేల బెలుం మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి లక్ష.రూపాయలు విరాళం.



బనగానపల్లె:నవంబర్=09 ప్రజాజ్యోతి కొలిమిగుండ్ల నవంబర్ 8. కొలిమిగుండ్ల మండలంలోని బంధార్ల పల్లె గ్రామంలో వెలిసిన నేల బెలుం మల్లేశ్వర స్వామి ఆలయంలో రూముల కొరకు బందార్లపల్లె గ్రామానికి చెందిన బాల సుబ్బారెడ్డి రూ. లక్ష నగదును ఆదివారం అందజేసినట్లు ఆలయ కమిటీ మెంబర్ రఘు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఈ విరాళం ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యాతం కళ్యాణ్ రెడ్డి. బాల వెంకటరెడ్డి . పెద్ద వెంకటరెడ్డి. గొడ్డేటి రాజారెడ్డి . చిన్న కులాయి రెడ్డి ఆలయ పూజారి రవి స్వామి.ఆలయ కమిటీ సభ్యులు. పాల్గొన్నారు.

మేరువ శాంతి చిన్న నరసింహారెడ్డి గారిని ఘనంగా సన్మానించిన జర్నలిస్టులు.



నంద్యాల :శిరివెళ్ల :నవంబర్=09=ప్రజాజ్యోతి శిరివెళ్ల: మండల పరిధిలోని ఎర్రగుంట్ల రెండవ ఎంపీటీసీ, కామినేని పల్లె మాజీ సర్పంచ్ మరియు మండల నేత అయినటువంటి మేరువ శాంతి చిన్న నరసింహారెడ్డి గారిని శిరివెళ్ల జర్నలిస్టులు ఘనంగా సన్మానం చేశారు. సిరివెళ్ల మండలంలో అత్యధిక ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్న తెలుగుదేశంపార్టీ ఎంపీటీసీ సభ్యులు మేరువ శాంతి చిన్న నరసింహారెడ్డి గారితోపాటు మిగిలిన 16 మంది ఎంపీటీసీ సభ్యులు సోమవారం ఎన్నికల అధికారుల ద్వారా డిక్లరేషన్ పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి విచ్చేసిన మేరువ శాంతి చిన్న నరసింహారెడ్డి గారినీ మండలంలోని సీనియర్ జర్నలిస్టుల పాటు యూనియన్ నేతలు సైతం పట్టు శాలువలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు.శిరివెళ్ల మండలంలో విశేష ప్రజాదరణ పొందిన నాయకునిగా అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న నేతగా గుర్తింపు పొందిన మేరువ చిన్న నరసింహారెడ్డి గారిని సన్మానం చేయడం గర్వకారణమని జర్నలిస్ట్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు 12 స్థిర నిఘా బృందాలు!

మూడు విడతల్లో పోలింగ్.. అక్రమ నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా

డిసెంబర్ 2న ఎటపాక, చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లో ఎన్నికలు



ఎటపాక, నవంబర్ 09 (ప్రజాజ్యోతి): పోలవరం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని 12 మండలాలకు ఒక్కొక్క ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌తో కూడిన 12 స్థిర నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మూడు విడతల్లో ఎన్నికలు..

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం మొదటి విడతలో నవంబర్ 26న అడ్డతీగల, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో, రెండో విడతలో నవంబర్ 29న దేవీపట్నం, గంగవరం, గుర్తేడు, రంపచోడవరం మండలాల్లో పోలింగ్ జరగనుంది. మూడో విడతలో డిసెంబర్ 2న చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, ఎటపాక మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. పోలింగ్ రోజున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

అక్రమ రవాణాపై నిఘా..

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, బహుమతుల పంపిణీని అరికట్టేందుకు స్థిర నిఘా బృందాలు ప్రధాన రహదారులు, జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు నిర్వహించనున్నాయి. అక్రమ నగదు, మద్యం, మత్తు పదార్థాలు, ఆయుధాల రవాణాపై నిరంతరం నిఘా ఉంచనున్నాయి. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రాజకీయ కార్యకర్తల వాహనాల్లో రూ.50 వేలకు మించిన నగదు, రూ.10 వేలకు మించిన విలువైన మద్యం, బహుమతులు తదితర వస్తువులు లభిస్తే నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటారు. అయితే వ్యాపార, వైద్య, వివాహ అవసరాల కోసం నగదు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు చూపితే మినహాయింపులు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. తనిఖీల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని, మహిళా అధికారిణి సమక్షం లేకుండా మహిళల పర్సులను తనిఖీ చేయరాదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు చివరి 72 గంటల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఎన్నికల తనిఖీల వీడియో రికార్డుల ప్రతులను రూ.300 చెల్లించి పొందవచ్చని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిఘా బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

మానసిక దివ్యాంగుల మధ్య దీపావళి సంబరాలు





కుటుంబ సమేతంగా పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు.

పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. నవంబర్ 9. మానసిక దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వులు నింపటానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లులోని అంజలి మానసిక దివ్యాంగుల పాఠశాలలో మానసిక దివ్యాంగుల మధ్య కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల, ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థులకు నూతన వస్త్రాలు, దీపావళి బాణాసంచా సామాగ్రి, స్వీట్లు, పండ్లు అందజేశారు. అనంతరం మంత్రి రామానాయుడు విద్యార్థులతో కలిసి బాణాసంచా కాల్చి వారిలో ఆనందోత్సాహాలు నింపారు. కుటుంబానికి దూరంగా వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో ఆప్యాయంగా గడుపుతూ వారిని సంతోషపరిచారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. అభం శుభం తెలియని చిన్నారులైన మానసిక దివ్యాంగ విద్యార్థులతో కలిసి దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న వీరితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా తమ కుటుంబ సభ్యులతోనే దీపావళి జరుపుకున్నామనే ఆత్మీయ భావన వారిలో కలుగుతుందన్నారు.దైవ స్వరూపులైన మానసిక దివ్యాంగులను ఆదరించడం, అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఇలాంటి విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.అనంతరం మంత్రి నిమ్మల కుటుంబ సభ్యులు గోమాతకు దానా వేసి పూజలు నిర్వహించారు. ఆప్యాయత, అనురాగాల మధ్య అంజలి పాఠశాలలో దీపావళి వేడుకలు ఆనందంగా సాగాయి.

గుంతకల్లు చెస్ క్రీడాకారులకు అంతర్జాతీయ ఘనత







ఒకేసారి ముగ్గురు చిన్నారులకు ఎఫ్ఐడి ఈ అంతర్జాతీయ ర్యాపిడ్ రేటింగ్స్

గుంతకల్లు నవంబర్ 8 (ప్రజా జ్యోతి):;చెస్ క్రీడలో గుంతకల్లు పట్టణానికి చెందిన ముగ్గురు చిన్నారు లు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నా రు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఎఫ్ ఐ డి ఈ) నవంబర్ 2026 ర్యాపిడ్ రేటింగ్ జాబితాలో ముగ్గురు విద్యార్థులు చోటు సంపాదించి గుంతకల్లు పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఎఫ్ఐడిఈ రేటింగ్ సాధించిన విద్యార్థులు దాక్షేష్ మహావర్ -- 1553,శ్రీరిషిత్ జె-- 1529, ఛాయా దేవి మఠం పత్రి-- 1458, అండర్-9 విభాగంలో ప్రత్యేక ఘనత 2017లో జన్మించిన దాక్షేష్ మహావర్, శ్రీరిషిత్ జె ఇద్దరూ అండర్-9 వయస్సు విభాగంలో గుంతకల్లు నుంచి అత్యధిక ఎఫ్ఐడిఈ ర్యాపిడ్ రేటింగ్స్ సాధించిన క్రీడాకారులుగా ప్రత్యేక గుర్తింపు పొందారు. దాక్షేష్ 1553 రేటింగ్‌తో, శ్రీరిషిత్ 1529 రేటింగ్‌తో రాణించడం విశేషం. అండర్-11 బాలికల విభాగంలో తొలి గుర్తింపు 2015లో జన్మించిన ఛాయా దేవి మఠం పత్రి 1458 ఎఫ్ఐడిఈ ర్యాపిడ్ రేటింగ్ సాధించారు. అండర్-11 బాలికల విభాగంలో గుంతకల్లు నుంచి తొలి ఎఫ్ ఐ డి ఈ ర్యాపిడ్ రేటింగ్ పొందిన బాలికగా ఆమె గుర్తింపు సాధించడం మరో విశేషం. విద్యార్థులు పాల్గొన్న టోర్నమెంట్లు ఛాయా దేవి మఠం పత్ర 2026 అక్టోబర్ 11న బెంగళూరులో నిర్వహించిన 1లో పాల్గొన్నారు. దాక్షేష్ మహావర్, శ్రీరిషిత్ జె 2026 అక్టోబర్ 17న కర్నూలులో నిర్వహించిన 2026లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కోచ్‌ల మార్గదర్శకత్వం లో విజయం ఈ ముగ్గురు విద్యార్థులు గుంతకల్లులోని మాస్టర్స్ చెస్ అకాడమీలో కోచ్‌లు అనిల్ కుమార్ మరియు రామారావు పర్యవేక్షణలో క్రమం తప్పకుండా చెస్ శిక్షణ పొందుతున్నారు. కోచ్‌ల మార్గదర్శకత్వం, నిరంతర సాధన, టోర్నమెంట్లలో పాల్గొనే అనుభవం విద్యార్థుల విజయానికి తోడ్పడ్డాయి. 2023 నుంచి గుంతకల్లులో విద్యార్థులకు చెస్ శిక్షణ అందిస్తున్న మాస్టర్స్ చెస్ అకాడమీ, ప్రతిభావంతులైన చిన్నారులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది. ఈ ముగ్గురు విద్యార్థుల విజయంపై వారి తల్లిదండ్రులు, కోచ్‌లు, చెస్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత మంది గుంతకల్లు విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిం చాలని ఆకాంక్షించారు ఒకేసారి ముగ్గురు చిన్నారులు ఎఫ్ఐడిఈ ర్యాపిడ్ రేటింగ్స్ సాధించ డం గుంతకల్లు చెస్ చరిత్ర లో మరో ముఖ్యమైన విజయంగా నిలిచింది.

కంబాల శ్రీనివాసరావు సారథ్యంలో తూర్పు, కాకినాడ జిల్లాల్లో కమల వికాసం

ఎంపీటీసీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం....

గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) నవంబర్ 09: తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు అఖండ విజయంతో గెలుపొందడం జరిగిందని, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ, రామసేన అధ్యక్షులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండి కార్యాలయం వద్ద ఎంపీటీసీ విజేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇటీవలే విడుదలైన ఫలితాల్లో తాను మద్దతిచ్చి, ప్రచారం చేసిన గోకవరం కూటమికి చెందిన నాలుగు ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో 18 మంది విజయం సాధించడం జరిగిందని, వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా గోకవరం ఎంపీటీసీ-1 భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని దోసపాటి నాగ వరలక్ష్మి 595 ఓట్లు మెజారిటీతో గెలిపోంది, చరిత్ర సృష్టించా రన్నారు. గత కొన్నేళ్లగా ఎంపీటీసీ -1 స్థానంలో కాంగ్రెస్ వైఎస్ఆర్సిపి పార్టీలే గెలుపొందుతూ వచ్చాయని అటువంటి స్థానంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి గెలుపొందటం చరిత్ర సృష్టించడమే అన్నారు. ఆ స్థానంలో భారతీయ జనతా పార్టీని ఆదరించిన దళితులు, మైనార్టీలు, ఇతర సామాజిక వర్గాలకు ప్రతి ఒక్కరికి కంబాల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై రానున్న బీజేపీ నాయకుల సమావేశాలో పార్టీ విధివిధానాలు మరియు భవిష్యత్ కార్యాచరణపై బీజేపీ పెద్దలు నిర్ణయం తీసుకుని జారీ చేస్తారని, వారిచ్చే ఆదేశాల మేరకు అభ్యర్థుల ఎంపికపై మిత్రపక్షాలతో సమావేశం అవుతామని తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో పార్టీ పరంగా రెండు కీలక సమావేశాలు జరగనున్నాయని కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశాల ద్వారా పార్టీ నుండి తదుపరి ఆదేశాలు, మార్గదర్శకాలు అందనున్నాయని చెప్పారు. పార్టీ నుంచి వచ్చే ఆదేశాల మేరకు, నేరుగా పత్రిక సమావేశం ద్వారా గానీ, లేదా వ్యక్తిగతంగా సమాచారాన్ని అందించడం ద్వారా గానీ భవిష్యత్ కార్యాచరణను శ్రేణులకు చేరవేస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఏ ఆదేశం ఇస్తే, ఆ ఆదేశాల మేరకే ముందుకు వెళ్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ నిర్ణయమే అంతిమమని ఆయన వెల్లడించారు. పార్టీ పెద్దలు, అధిష్టానం ఏం చెబుతుందో తెలుసుకున్న తర్వాత, స్థానిక పరిస్థితులు మరియు పార్టీ ఆదేశాలను బేరీజు వేసుకుని తదుపరి నిర్ణయం



తీసుకుంటామని వెల్లడించారు. గ్రామస్థాయిలో కొందరు నేతల పేర్లు ప్రస్తావిస్తూ వస్తున్న వదంతులపై స్పష్టత నిచ్చారు. ప్రజల్లో ఎటువంటి గందరగోళం సృష్టించవద్దని, పార్టీ అధిష్టానం నుండి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఎవరూ అనధికారిక ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించారు.పార్టీ శ్రేణులంతా సమన్వయంతో, క్రమశిక్షణతో వ్యవహరించి, అధిష్టాన ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. గెలుపొందిన ఎంపిటిసి అభ్యర్థులకు ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, ఎంపీటీసి విజేతలు, రామసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

పార్టీలకతీతంగా శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం బలోపేతానికి కృషి చేస్తాం





- బలిజ సంఘం ఆత్మీయ సమావేశంలో సంఘం సభ్యుల పిలుపు.

చెన్నూరు: పబ్లిక్ టుడే;రాజకీయ పార్టీలకు అతీతంగా మండలంలోని శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘమును బలోపేతం చేసే దిశగా అడుగులు ముందుకు వేయాలని సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. చెన్నూరు బిఎస్ఎన్ఆర్ కళ్యాణమండపంలో ఆదివారం రోజు మండల శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం యువత ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం సభ్యులు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధాలు లేకుండా, కేవలం సంఘం అభివృద్ధి ధ్యేయంగా సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల నేపథ్యం దృష్ట్యా సంఘం ఏర్పాటు చేయబడలేదని, ఈ బలిజ సంఘం 1983 వ సంవత్సరంలోనే ప్రారంభించబడిందని తెలిపారు. 1956వ సంవత్సరానికి ముందు బలిజలకు రిజర్వేషన్ సౌకర్యం ఉండేదని, కాలక్రమమైన కొన్ని రాజకీయ పార్టీల అణచివేత దిశలో రిజర్వేషన్ లేకుండా చేశారని వివరించారు. కేవలం చెన్నూరు మండలంలోనే 4000 పైగా బలిజలు ఉన్నారని, అలాగే నియోజకవర్గ ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షల్లో జనాభా కలిగి ఉన్నారని తెలిపారు.ఒక ప్రణాళిక ప్రకారం కొంతమంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఒక రాయలసీమలో మాత్రమే బలిజ నేతలకు నాయకులకు సరైన ప్రాధాన్యత సంతరించుకోలేదని అన్నారు.ముఖ్యంగా కోస్తా, తూర్పుగోదావరి పశ్చిమగోదావరి తదితర జిల్లాలలో వారికి కాపుల పేరుతో ఉన్నటువంటి ప్రాధాన్యత అందరికీ తెలిసిన విషయమే ఈ సందర్భంగా వారు తెలియజేశారు.అదే తరహాలో రాయలసీమతో పాటు, ముఖ్యంగా కడప జిల్లాలో బలిజలకు ఇటువంటి ప్రాధాన్యత సంతరించుకునేందుకు అందరూ సహకరించి తగినటువంటి కృషిని చేయాలని వారు కోరారు. పరస్పర సహకారంతో ఎటువంటి సమస్యలనైనా సాధించు కోవచ్చని వారు సంఘ సభ్యులకు తెలియజేశారు. ఐకమత్య లోపం వలన నష్టాలే తప్ప అభివృద్ధికి చోటు ఉండదని వివరించారు.సమాజంలో ముఖ్యంగా బలిజ నేతలకు, ప్రజలకు 13వ శతాబ్దంలో పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలే మార్గదర్శిగా నిలిచారని వారు వివరించారు. "అన్ని భాషలలో కెల్లా తెలుగు భాష లెస్స" అనే నానుడితో దశ దిశల తన కీర్తిని ప్రకాశింపజేసిన ఘనత ఒక్క శ్రీకృష్ణదేవరాయలకి దక్కిందని పేర్కొన్నారు. రాయల పరిపాలన కాలంలో ఏడు పర్యాయాలు తిరుమల తిరుపతి వెంకటేశ్వర్లు సన్నిధిని దర్శించుకుని ఆ దేవస్థానానికి అవసరమైన బంగారు ఆభరణాలను సమర్పించారని వివరించారు. అంతేకాకుండా దేశంలో పలు ప్రాంతాలలో నదీ తీరాలలో ఆలయాలను నిర్మించిన గొప్ప వ్యక్తిగా రాయలు కీర్తింపబడ్డారని కొనియాడారు. అటువంటి సేవా తత్వాన్ని పేరుతో ఏర్పాటు చేసుకున్న సంఘాన్ని అందరి సహకారంతో అభివృద్ధి బాటలో నడుపుకోవాలని ఆకాంక్షించారు. సంఘం సభ్యులలో ఆర్థిక ,విద్య ఉద్యోగాల పరంగా ముందుకెళుతున్న ప్రతి సభ్యుడు మిగతా సభ్యుల కుటుంబాలకు ఏదో ఒక మార్గంలో సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో బలిజల సంఘం కమిటీ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా రక్తదాన కార్యక్రమాలను ప్రారంభించడం జరుగుతుందని తెలియజేశారు చేయి చేయి కలుపుదాం– బలిజల ఐక్యత చాటుకుందాం అనే నినాదంతో హోరెత్తించారు.ఈ ఆత్మీయ సమావేశంలో మండల వ్యాప్తంగా దాదాపు 400 మందిసభ్యులు పాల్గొనడం జరిగింది.

చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం.



ఆలమూరు, నవంబర్ 9 (ప్రజాజ్యోతి):చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానంలో సోమవారం చండీ హోమం పూజా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దింటి మణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ చండీ హోమం ఘనంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ వీరి అప్పారావు, సభ్యులు గన్ని వెంకట్రావు,కాలా సూరిబాబు,పూదూరి శ్రీనివాసు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి. వీర్రాజు చౌదరి అమ్మవారి సేవా కార్యక్రమాలను పర్యవేక్షించారు. లోక కళ్యాణం, సర్వజన శ్రేయస్సు కోసం అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

ఉచిత వేరుశనగ విత్తనాలు పంపిణీ.



దేవనకొండ ప్రజా జ్యోతి న్యూస్(రాఘవేంద్ర).రైతులకు ఉచితంగా ఎస్ఎస్ఎం–1694. రకం వేరుశెనగ విత్తనాలు పంపిణీ. దేవనకొండ మండలం తెర్నేకల్లో గ్రామంలో జాతీయ ఆహార నూనె గింజల పథకం.2026–27 రబి సీజన్ లో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగాఎస్ఎస్ఎం–1694రకం. వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి 180 క్వింటాలు కేటాయించిగా. పొట్లపాడు.తెర్నేకల్. కప్పట్రాళ్ల . నెల బండ గ్రామాలకు45 క్వింటాలు చొప్పున కేటాయించారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని అధిగ దిగబడులు సాధించాలని ఆమెసూచించారు

ఘనంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు

ఏజెన్సీ చట్టాల అమలు, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు నిరంతర పోరాటం

జీవో 3 స్థానంలో ఉద్యోగ నియామక చట్టం తేవడమే భవిష్యత్ లక్ష్యం

ఏటీఏ రాష్ట్ర సహాధ్యక్షులు కణితి శేఖర్





ఎటపాక, నవంబర్ 09 (ప్రజాజ్యోతి): ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ఏజెన్సీ చట్టాల పరిరక్షణే ధ్యేయంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) నిరంతరం ఉద్యమిస్తుందని ఆ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాధ్యక్షులు కణితి శేఖర్ స్పష్టం చేశారు. సోమవారం ఎటపాక మండల కేంద్రంలో ఏటీఏ మండల సహాధ్యక్షులు మానె ప్రవీణ్ అధ్యక్షతన సంఘం 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కణితి శేఖర్ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం, ఏజెన్సీ చట్టాలు పటిష్టంగా అమలయ్యేలా సంఘ నిర్మాణం కోసం నాయకులు క్షేత్రస్థాయిలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సుప్రీంకోర్టు రద్దు చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 3 స్థానంలో సమగ్ర షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం తీసుకురావడమే తమ భవిష్యత్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ చట్ట సాధన కోసం ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులందరినీ ఏకం చేసి విస్తృత స్థాయి ఉద్యమ కార్యాచరణను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కణితి రామకృష్ణ, జిల్లా సహ కార్యదర్శి కాకా రాజు, మండల ప్రధాన కార్యదర్శి అపక నాగేశ్వరరావు, కోశాధికారి కుర్సం రాకేష్, నాయకులు వడియం రాకేష్, పోడియం కామేష్, మడకం రాంబాబు, గొంది లక్ష్మి, తుర్రం రజిని, కరక సతీష్, కుర్సం కవిత, అపక రమేష్, విజయకుమారి, వసంతలక్ష్మి, భాగ్యశ్రీ, పూనెం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ స్థానాల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేస్తుంది!



ప్రజా జ్యోతి న్యూస్ పాపికి నవంబర్ 9 కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయదుందుభి పార్టీల ఐక్యత, నాయకుల సమన్వయమే విజయానికి ప్రధాన కారణం డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ కర్నూలు: రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో విజయం సాధించేలా సమష్టిగా కృషి చేస్తామని డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకుడు వై. నాగేశ్వరరావు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం పార్టీల ఐక్యతకు, నాయకుల సమన్వయానికి నిదర్శనమని పేర్కొన్నారు.సోమవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి తమ ఆదరణను చాటుకున్నారని తెలిపారు. వైసీపీ పాలనలోని విధానాలపై ప్రజలు తమ తీర్పు ద్వారా స్పందించారని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీలు బైరెడ్డి శబరి, పస్తిపాటి నాగరాజుతో పాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమష్టిగా పనిచేయడం అభినందనీయమన్నారు. నాయకుల మధ్య సమన్వయం ఎన్నికల నిర్వహణలోనూ ప్రతిఫలించిందని పేర్కొన్నారు.రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ ఇదే ఐక్యతను కొనసాగించి కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల విజయానికి శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వై. నాగేశ్వరరావు యాదవ్ స్పష్టం చేశారు.

శివాలపల్లి శ్రీ వీరభద్ర లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో వైభవంగా అమావాస్య పూజలు

చెన్నూరు,నవంబర్ 9, చెన్నూరు మండలం శివాల పల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి (ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయంలో ప్రతి అమావాస్య లాగానే ఈ అమావాస్య బహుళ అమావాస్య కావడంతో స్వామి వారికి అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు, సోమ వారం ఉదయం 7:00 గంటలకు స్వామి వారికి శివాల పల్లి గ్రామానికి చెందిన ఉభయ దాతలైన కీర్తిశేషులు ఆదిమూలం పాల పెద్దన్న వారి జ్ఞాపకార్థం వారి సతీమణి శ్రీమతి ఆదిమూ లం లక్ష్మమ్మ వారి కుమారుడు బిజెపి సీనియర్ నాయకుడు ఆదిమూలం వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు ఆలయం వద్దకు చేరుకున్నారు, స్వామివారికి పూలు పండ్లు పాలు నెయ్యి పెరుగు స్వామివారికి వస్త్రాలు ను సమర్పించగా ఆలయ అర్చక పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ శర్మ వేదమంత్రాలతో వారి చేత వివిధ రకాల వివిధ రకాల అభిషేక పూజలు నిర్వహించా రు, ముందుగా వినాయకునికి పూజలు నిర్వహించారు, అనం తరం శ్రీ వీరభద్ర లక్ష్మీనరసింహస్వామి పంచామృత అభిషేకం నిర్వహించారు, స్వామి వారికి పూల అలంకరణ వస్త్ర అలంక రణ నిర్వహించారు, ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపకులు పొట్టి పాటి ప్రతాపరెడ్డి ఏర్పాట్లు చేశారు, పూజల అనంతరం ఉభయ దాతలు వెంకటసుబ్బయ్య వారి కుటుంబ సభ్యులకు స్వామివారి తరఫున ఆలయ అర్చకులు ప్రసాదాల అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పొట్టి పాటి ప్రతాపరెడ్డి వారి కుటుంబ సభ్యులు, పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు, భక్తులకు ఆలయ నిర్వహకులు తీర్థప్రసాదా లు ప్రసాద వితరణ నిర్వహించారు, బహుళ అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు,



జడ్పి చైర్మన్ పీఠంపై డాక్టర్ షేక్ సాధిక గురి.



ప్రజా జ్యోతి న్యూస్ (రాఘ వేంద్ర) దేవనకొండ. ఆలూరు టిడిపి ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు స్థానిక సమాచారం. దేవన కొండ మండలం జెడ్పిటిసిగా గెలిచినా షేక్ సారిక గారు జిల్లా చైర్మన్ పీఠంపై గురి పెట్టినట్లు రాజకీయ వర్గాలలో చర్చలు సాగుతున్నాయి. ఈ మే మామ టీడీపీ సీనియర్ నా యకుడు ఈదుల దేవరబండ సుభాన్ కాబట్టి చైర్మన్ పదవి పీఠం దక్కించుకునేందుకు పావులు కదుపుతున్న ట్లు జోరుగా ప్రచారం సాగుతుంది. ఈ వ్యవహారం అంత ఆలూరు టిడిపి ఇన్చార్జ్ శ్రీమతి వైకుంఠ జ్యోతి ఆధ్వర్యంలో చర్చలు జరిగినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ బి పడాలి బి రౌండ్ టు మహిళలకు శిక్షణ





చెన్నూరు, నవంబర్, 9,పోషణ్ బి పడాయి బి రౌండ్ టు పై చెన్నూరు మండలం కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పిల్లల తల్లిదండ్రులు గర్భిణీ మహిళలు మహిళలకు సోమవారం ఉదయం శిక్షణా కార్యక్రమం ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు, మండల విద్యాశాఖ అధికారి సునీత సూపర్వైజర్ గుర్రమ్మ మాట్లాడుతూ నవచేతన0-3 సంవత్సరముల పిల్లలలో ప్రారంభ దశలో ఉద్దీపన మరియు అభివృద్ధి మైలురాళ్లు మరియు పోషన్ ట్రాకర్ ద్వారా ఇంటి సందర్శనల ఇంటి ఆధారిత హోమ్ బేస్డ్ యాక్టివిటీస్ మరియు సమర్థవంతమైన ఇంటి సంఘర్షణల ప్రణాళిక నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు,ఆధార్ శీలా బోధనా విధానం ద్వారా ఈసీసీ మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లల కు పునాది అభ్యసన ప్రాముఖ్యత మరియు రోజువారి దినచర్యలను ప్రణాళిక చేయడానికి ఆధార్ శీలా వారపు క్యాలెండర్ వినియోగము మరియు బాలారంబ దశలో అభివృద్ధి మహిళలు ప్రేరణ సూచికల గురించి డెవలప్ మెంట్ మైల్డ్ స్టోన్స్, వెయ్యి రోజుల ప్రాముఖ్యత, ఆధార్ శీలా త్రీ టు సిక్స్ ఇయర్స్ పిల్లలకు అభివృద్ధి గురించి వివరించడం ప్రకృతిలో దొరికేటటువంటి వివిధ రకాల ఆకులు రాళ్లు చింతపిచ్చలతో మరియు అట్టముక్కలతో ఎటువంటి ఖర్చు లేకుండా ఇంట్లో దొరికే వస్తువులతోనే పిల్లలకు బోధనా పరికరాలను తయారు చేయడం గురించి వివరంగా తెలియజేశారు,కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్ సి బి ఈవెంట్స్ మరియు ఈసీసీ డే ప్రతినెల సామాజిక సామూహిక కార్యక్రమాల ద్వారా తల్లులకు మరియు కుటుంబ సభ్యులకు గర్భవతులు తీసుకోవలసిన పోషకాహారం మరియు విశ్రాంతి జాగ్రత్తల గురించి అదేవిధంగా ఆరు నెలలు పూర్తయినటువంటి పిల్లలకు అన్న ప్రాసన మరియు ప్రీస్కూల్ సంస్థ పోషణ వేడుకలు మొదలైనటువంటి కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు కార్యక్రమము ఈ కార్యక్రమంలో కొండపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవ అంగన్వాడీ కార్యకర్తలు మహిళలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరు అయ్యారు,

అటవీసరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి!







రాత్రి సమయాల్లో అటవీలోకి వెళ్ళొద్దు!..

అటవీశాఖ అధికారులు!..

వరరామచంద్రాపురం, నవంబర్ 9 (ప్రజాజ్యోతి ప్రతినిధి) వి.ఆర్.పురం రేంజ్ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీశాఖ అధికారి రామకృష్ణ, వివరించారు. సోమవారం, పులుల, సంచారం పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పులుల సంచారం, వాటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పులి ఎదురైనప్పుడు పాటించాల్సిన భద్రతా చర్యలపై గ్రామస్థులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. గ్రామస్థులకు క్రింది సూచనలు మరియు ముందస్తు జాగ్రత్తలు వివరించడం జరిగిందని సూచించారు.

1):ముఖ్యంగా తెల్లవారుజామున మరియు సాయంత్రం వేళల్లో ఒంటరిగా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, సూచించారు.

2):పులి కనిపించినప్పుడు దాని దగ్గరకు వెళ్లడం, వెంటాడడం లేదా రెచ్చగొట్టడం చేయకూడదని పేర్కొన్నారు.

3):పులుల సంచారం గుర్తించిన ప్రాంతాల్లో పశువులను మేతకు తీసుకెళ్లకూడదని వివరించారు.

4):పిల్లలు మరియు పశువులపై ఎల్లప్పుడూ తగిన పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు.

5):రాత్రి వేళల్లో అటవీ ప్రాంతాల గుండా ప్రయాణించడం నివారించాలని తద్వారా రక్షణ ఉంటుందని అన్నారు.

6):పులుల సంచారానికి సంబంధించి నిర్ధారణ కాని వార్తలు, వదంతులు ప్రచారం చేయకూడదన్నారు.

7):పులి కనిపించినా, పాదముద్రలు గుర్తించినా లేదా పశువులపై దాడిజరిగినా వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

8):అటవీ శాఖ అధికారులు జారీ చేసే సూచనలు మరియు భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

మానవ ప్రాణాలకు మరియు వన్యప్రాణులకు ఎలాంటిహాని కలగకుండా ఉండేందుకు అటవీ శాఖకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. మానవ-వన్యప్రాణి సంఘర్షణ నివారణ చర్యల్లో భాగంగా వి.ఆర్.పురం రేంజ్ అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఈఅవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొలుములపల్లెలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన





చిరుధాన్యాల సాగుతో రైతులకు అధిక ఆదాయం

డా. శ్యామ్ రాజ్ నాయక్

చింత కొమ్మ దిన్నె ప్రజాజ్యోతి 09/11/2026

వైఎస్సార్ కడప జిల్లా, సి.కె. దిన్నె మండలం కొలుములపల్లె గ్రామంలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన మహానంది వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రం, ఉటుకూరు ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహానంది వ్యవసాయ కళాశాల సహ సంచాలకులు డా. చి. శ్యామ్ రాజ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పంటలతో పాటు చిరుధాన్యాల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, వాటితో వివిధ ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పంటల మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులు, విలువ జోడింపుతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిజ్ఞానం లభిస్తుందని తెలిపారు. రైతులతో కలిసి పనిచేయడం, వారి సమస్యలను తెలుసుకోవడం, సాగు పద్ధతులను పరిశీలించడం ద్వారా ఆచరణాత్మక అనుభవం పెరుగుతుందన్నారు.కృషి విజ్ఞాన కేంద్రం, ఉటుకూరు ప్రధాన శాస్త్రవేత్త డా. కె. సునీల్ కుమార్ మాట్లాడుతూ పసుపు పంటలో సమగ్ర సస్యరక్షణ, పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. నాణ్యమైన విత్తన దుంపల ఎంపిక, సమతుల్య ఎరువుల వినియోగం, కలుపు నివారణ, చీడపీడల నియంత్రణపై అవగాహన కల్పించారు. చామంతి సాగు, నిమ్మజాతి పంటల్లో ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణ చర్యలను వివరించారు.మహానంది వ్యవసాయ కళాశాల సహాయ ఆచార్యులు డా. వై. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు రైతులతో కలిసి నివసించి వారి జీవన విధానం, వ్యవసాయ సమస్యలు, సాగు పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సమాచార నైపుణ్యాలు, రైతులతో సంబంధాలు, వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలపై అనుభవాన్ని పెంపొందిస్తుందన్నారు. కడప వ్యవసాయ ఉప సంచాలకులు లక్ష్మీ మాధవి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలపై అందిస్తున్న సహాయాన్ని వినియోగించుకొని ఆధునిక సాగు పద్ధతులను పాటించాలన్నారు.అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు సందర్శించారు. ఇందులో వివిధ పంటల సాగు విధానాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, చీడపీడల నివారణ, చిరుధాన్యాల ప్రాధాన్యత, వాటితో తయారు చేసే ఉత్పత్తుల నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు రైతులకు వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డా. టి. మహేష్ బాబు, వ్యవసాయ అధికారులు పద్మజ, సుచిత్ర, మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారి సుమంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కొలుములపల్లె, అప్పరాజుపల్లె, అన్నలూరు, తాడిగొట్ల గ్రామాలకు చెందిన రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్యవసాయ నిపుణులు, అధికారులు, విద్యార్థులు అందించిన సూచనలతో రైతులు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పొందారు.

వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార పంపిణీ



బ్రహ్మంగారిమఠం – ప్రజా జ్యోతి నవంబర్ 9 మండల కేంద్రంలోని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు.మఠాధిపతులు శ్రీవీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆదేశానుసారం,మండల ఆరోగ్య కేంద్రం నందు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మేనేజర్ పి పి ఎన్ ప్రసాద్ తెలిపారు.గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యం చేకూర్చే విధంగా మఠం యాజమాన్యం చేస్తున్న కృషికి పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీ,బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని,మఠం చేస్తున్న ఈ సేవా కార్యక్రమం ఎంతో అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మఠం సిబ్బంది అనిల్ కుమార్ రెడ్డి,కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రజల మద్దతు సంతోషం, కోన రఘుపతి

ఎంపీపీ అభ్యర్థిగా వీరారెడ్డి పేరు ఖరారు



బాపట్ల నవంబర్ 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తుపాను పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అభినందనీయమని మాజీ డిప్యూటీ స్పీకర్ బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు దక్కడం సంతోషంగా ఉందన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందని, ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల తమ పార్టీ ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ఎన్నికల్లో పాల్గొన్నారని తెలిపారు.ఎంపీపీ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వీరారెడ్డిని నిర్ణయించినట్లు కోన రఘుపతి వెల్లడించారు. ఎనిమిది మంది మెజారిటీ సభ్యుల మద్దతు ఉండటంతో వీరారెడ్డి పేరును ఖరారు చేసినట్లు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు, విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పదవి రాకముందే ప్రజా సేవలో: రోడ్డుపైకి వచ్చిన నూతన కౌన్సిలర్ 'పేకేటి సుధా' దంపతులు!

ప్రమాణ స్వీకారానికి ముందే సమస్యల పరిష్కారం -- వార్డు ప్రజల హర్షాతిరేకాలు



గొల్లప్రోలు ప్రజా జ్యోతి ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు సాధారణంగా ప్రమాణ స్వీకారం చేసి, సీట్లలో కూర్చున్న తర్వాతే వార్డుల వైపు చూస్తుంటారు. కానీ, ఇందుకు భిన్నంగా తాము ఎల్లప్పుడూ ప్రజా సేవకే అంకితమని నిరూపించారు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరపున వార్డ్ కౌన్సిలర్‌గా ఘన విజయం సాధించిన పేకేటి సుధా మరియు వారి భర్త. ఇంకా అధికారికంగా ప్రమాణ స్వీకారం కూడా చేయకముందే, వార్డు ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావించి వారు తీసుకున్న చొరవ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది, ప్రజల గుండెల్లో వారికి ఉన్న స్థానాన్ని మరింత పెంచింది. వార్డులో నూతనంగా వేసిన పైప్‌లైన్ పనుల కారణంగా రోడ్డుపై పెద్ద పెద్ద రాళ్లు పేరుకుపోయి, వాహనదారులు, నడిచే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఈ దంపతులు గుర్తించారు. ప్రమాణ స్వీకారం కాలేదు కదా అని వారు వేచి చూడలేదు. ప్రజల కష్టాన్ని చూసి చలించిపోయిన పేకేటి సుధా దంపతులు వెంటనే రంగంలోకి దిగారు. సొంత చొరవతో, తక్షణమే ట్రాక్టర్లను రప్పించి, రోడ్డుకు అడ్డంగా ఉండి ఇబ్బంది కలిగిస్తున్న ఆ భారీ రాళ్లను యుద్ధప్రాతిపదికన తొలగించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితి ఉన్నప్పటికీ, స్వయంగా దగ్గరుండి పనులను పర్యవేక్షించి, రహదారిని ప్రజల రాకపోకలకు అనుకూలంగా మార్చారు.

నిజమైన ప్రజా నాయకులు వీరే!

పదవి అనేది కేవలం హోదా కోసం కాదు, ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన ఒక బాధ్యత అని పేకేటి బాల సత్య సుధా రామ్మూర్తి దంపతులు ఆచరణలో చూపిస్తూ ఆదర్శంగా నిలిచారు. ప్రమాణ స్వీకారానికి ముందే ఇంతటి సేవా దృక్పథాన్ని, బాధ్యతను చాటుకున్న వీరిని చూసి వార్డు ప్రజలు అభినందనల వర్షం కురిపిస్తున్నారు. "మా సమస్యను ఇంత వేగంగా స్పందించి పరిష్కరించిన ఇలాంటి నాయకులను ఎన్నుకోవడం మా అదృష్టం" అంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ వార్డు మరింత అభివృద్ధి చెందడం ఖాయమని, పేకేటి బాల సత్య సుధా రామమూర్తి దంపతుల నాయకత్వంలో వార్డు రూపురేఖలు మారిపోతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు..

--రూ.12.50 లక్షల లిక్విడ్ గంజాయి పట్టివేత ముగ్గురు అరెస్ట్.
--ఒడిశా నుంచి యూపీకి గంజాయి అక్రమ రవాణా.



ఏఎస్ఐ టీ. రాజేశ్వరరావు, ఎం. గంగరాజు, హెడ్ కానిస్టేబుల్ మురళి పాల్గొన్నారు.

మోతిగూడెం ప్రజాజ్యోతి నవంబర్ 09 : ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా టెలరాయ్ గ్రామం నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న రూ.12.50 లక్షల విలువైన సుమారు కిలో లిక్విడ్ గంజాయిని మోతుగూడెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ తన సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో ఈ అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి సుమారు ఒక కిలో లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.12,50,000గా అంచనా వేశారు.ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆశు జాఫ్రీ, ఒడిశాకు చెందిన ముకుంద హంతల్, మాల మదకామిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు.ఈ దాడిలో మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్‌తో పాటు

కరుణించమ్మా అక్కమాంబ తల్లి

- అంగరంగ వైభవంగా అక్కమాంబ పేరంటాల బోనాల ఉత్సవం
- కార్తీక తొలి సోమవారం భక్తిశ్రద్ధలతో అక్కమాంబకు బోనాల సమర్పణ
- బోనం తో నాయుడు వీధి నుండి ఆలయానికి ఊరేగింపు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి,మాజీ ఎంపీపీ కూన ప్రమీల











పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్: పిలిస్తే పలికే తల్లి... భక్తుల కొంగుబంగారం... ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం... అమ్మల గన్న అమ్మగా పేరొందిన అక్కమాంబ పేరంటాలమ్మ బోనాల ఉత్సవం పొందూరు మండల కేంద్రంలో కన్నుల పండువగా జరిగింది. కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలకు పొందూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన అక్కమాంబ పేరంటాల బోనాలు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ సాగిన ఊరేగింపులు... అమ్మవారి నామస్మరణతో మార్మోగిన వీధులు భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.పొందూరు నాయుడు వీధిలోని అమ్మవారి కన్నవారింటి నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు ప్రధాన మార్కెట్ ఆవరణలోని అక్కమాంబ పేరంటాలమ్మ ఆలయానికి చేరుకుంది. కన్నవారింటి నుంచి తొలి బోనం, అత్తవారింటిగా భావించే రాంబిల్లి వారి ఇంటి నుంచి రెండో బోనం, జరజాపు వారి ఇంటి నుంచి మూడో బోనం సంప్రదాయబద్ధంగా సమర్పించడం ఈ ఉత్సవాల్లో ప్రత్యేకతగా నిలుస్తోంది.కేవలం ఓ పండుగగానే కాకుండా పొందూరు ప్రజల జీవన విధానంలో భాగంగా అక్కమాంబ పేరంటాలమ్మ ఆరాధన కొనసాగుతోంది.ఇంట్లో ఏ శుభ కార్యం జరిగినా ముందుగా అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ఆశీస్సులు తీసుకోవడం ఇక్కడి ప్రజల అనవాయితీ. అంతేకాదు... ఆడపిల్లలకు అక్కమాంబ, అక్కమ్మ అని...మగపిల్లలకు అక్కప్ప, అక్కలనాయుడు వంటి పేర్లు పెట్టుకోవడం ద్వారా తరతరాలుగా అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకుంటున్నారు.ఈ వేడుకల్లో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరిపై అక్కమాంబ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు,ఎంపీటీసీ -4 చిగిలపల్లి రామ్మోహన్ రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ రాంబిల్లి నాగరాజు ,ఎంపీటీసీ -2 అనకాపల్లి లోకేష్ (చిన్న) అనకాపల్లి శివకుమార్ మొకర సత్యన్నారాయణ అనకాపల్లి రాజారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మిగనూరు లో రెండు జెడ్పీటీసీ, 40 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నాం

-- ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు చారిత్రాత్మక విజయాన్ని అందించారు



ఎమ్మిగనూరు, నవంబర్ 09(ప్రజా జ్యోతి): నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించిన నేపథ్యంలో, గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో కలసి ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి పాత్రకేయ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు జెడ్పీటీసీ స్థానాలతో పాటు 40 ఎంపీటీసీ స్థానాలను చారిత్రాత్మక మెజారిటీలతో కైవసం చేసుకోవడమే కాకుండా, ఎంపీపీ స్థానాలను కూడా కూటమి కైవసం చేసుకుందని తెలిపారు.గత మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని గ్రామీణ ప్రాంతాల్లో కూడా పునరావృతం చేస్తూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు తమ మద్దతును ఓట్ల రూపంలో తెలియజేశారని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి లభించిన మెజారిటీకి సమానంగా ప్రస్తుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ప్రజలు ఆదరణ చూపించడం ఎంతో సంతోషకరమని అన్నారు. గత 30--40 సంవత్సరాలుగా ఎమ్మిగనూరు మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగే పరిస్థితులు ఉన్నప్పటికీ, ఈసారి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించి, ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుని తమ నిర్ణయాన్ని స్పష్టంగా వెల్లడించారని తెలిపారు.ఈ విజయం కేవలం ప్రారంభం మాత్రమేనని, రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనే కాకుండా 2029 సాధారణ ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థులకు అండగా నిలిచి, విజయానికి కృషి చేసిన కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయం సాధించిన జెడ్పీటీసీ సభ్యులు తిరుపతయ్య నాయుడు, నందవరం చార్లెస్, పెద్ద కొత్తిలి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఏఎంసీ చైర్మన్ కురుమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల విజేతలకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అభినందనలు



బాపట్ల నవంబర్ 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ తరఫున విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అభినందనలు తెలిపారు. సోమవారం బాపట్లలోని టీడీపీ కార్యాలయంలో బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం ఎంపీటీసీగా గెలుపొందిన కుర్రా శ్రీలక్ష్మితో పాటు పిట్టలవానిపాలెం మండలానికి చెందిన ఎంపీటీసీ విజేతలు ఎమ్మెల్యేను కలిశారు.ఎన్నికల్లో విజయానికి సహకరించిన ఎమ్మెల్యేకు శ్రీలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా చెరువు జమ్ములపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదప్రోలులో ఉచిత వైద్య శిబిరం

బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా కార్యక్రమాలు



బాపట్ల నవంబర్ 09 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి) గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే దిశగా బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో ఐదో రోజు భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో 57 మంది గ్రామస్థులకు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. 49 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందించగా, వైద్య పరీక్షలకు ఉపయోగించే పరికరాల వినియోగంపై విద్యార్థులు ప్రత్యక్షంగా అవగాహన పొందారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే సందేశంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని బహిరంగ మురుగు కాలువల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ,కె.వి.వి.ఎన్. సిరీష, ఎంపీహెచ్‌డబ్ల్యూ పి. ఝాన్సీ, ఆశా కార్యకర్త కె. భవాని, వైద్యులు డా. వి. శ్రీలత, డా. ఎ. లలిత, డా. అబ్దుల్ సలాం, పంచాయతీ కార్యదర్శి ఎల్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యమే ప్రథమ ప్రాధాన్యత..

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు

18వ వార్డులో సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లించిన కౌన్సిలర్ భార్గవ తేజ్



ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరుపట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా 18వ వార్డు కౌన్సిలర్ బలస భార్గవ తేజ్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. వార్డులోని పాఠశాలలు, వీధులు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.ఈ క్రమంలో 18వ వార్డులో ఉన్న సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణలో బ్లీచింగ్ పౌడర్ చల్లించే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండేలా ఈ చర్యలు తీసుకున్నారు.పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు శుభ్రత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా సూచించారు. వార్డులోని ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సంబంధిత పారిశుధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనులు కొనసాగిస్తామని తెలిపారు.ప్రజారోగ్యమే ప్రధాన ధ్యేయంగా భావించి వార్డులో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని కౌన్సిలర్ భార్గవ తేజ్ పేర్కొన్నారు. పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు.

సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలకు పరిశీలకులా!

-పరిశీలకుల పేరుతో ఉపాధ్యాయులను అవమానించడమేంటి ?

-ఎస్.ఎల్.ఓ లను రద్దు చేయాల్సిందేనని డీఈఓ కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ వినతి.



బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 9 (ప్రజాజ్యోతి) పాఠశాల స్థాయిలో నిర్వహించాల్సిన సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలు-1 నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ అనుసరిస్తున్న విధానం ఉపాధ్యాయులను అనుమానించేదిగా, అవమానించే విధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కడపలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈవో షేక్ షంషుద్దీన్ ను కలిసి స్కూల్ లెవెల్ అబ్జర్వర్స్ (ఎస్.ఎల్.ఓ) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణంగా ప్రతి పాఠశాల పరిధిలో నిర్వహించాల్సిన సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలకు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పరిశీలకులుగా నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ అనుమానితులుగా పరిగణించి, పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలనే ఉద్దేశంతో ఇతర పాఠశాలల ఉపాధ్యాయులను పరిశీలకులుగా నియమించడం ఉపాధ్యాయుల వృత్తిపరమైన గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు కేవలం పరీక్షలు నిర్వహించే ఉద్యోగులు మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతాయుతమైన విద్యావేత్తలని, విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ, వారి సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నవారని పేర్కొన్నారు. అలాంటి ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచకుండా వారి సొంత పాఠశాలలో జరిగే పరీక్షలకు ఇతర పాఠశాలల నుంచి పరిశీలకులను నియమించడం ద్వారా ఉపాధ్యాయులపై అనవసరమైన అపనమ్మకాన్ని వ్యక్తం చేసినట్లవుతుందని, అది సమాజానికి తప్పుడు సంకేతాలను ఇచ్చినట్లు అవుతుందని వారు తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతం ఉండాల్సిందేనని, పరీక్షల ప్రశ్నపత్రాల భద్రత, సమయపాలన, జవాబు పత్రాల మూల్యాంకనం, ఫలితాల విశ్వసనీయత వంటి అంశాల్లో ఎలాంటి రాజీ ఉండకూడదనే విషయంలో యుటిఎఫ్‌కు స్పష్టమైన అభిప్రాయం ఉందన్నారు. అయితే పారదర్శకత పేరుతో ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధానాలను అనుసరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనేక రకాల బోధనేతర పనులు, పరిపాలనా బాధ్యతలు, వివిధ యాప్‌లలో సమాచార నమోదు, ఇతర విద్యాశాఖ కార్యక్రమాలతో ఇప్పటికే తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక పాఠశాల ఉపాధ్యాయులను మరొక పాఠశాలకు పరిశీలకులుగా పంపడం, తిరిగి తమ పాఠశాల పరీక్షల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం వల్ల అదనపు పని భారం, సమయాభావం, బోధనకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులు ఒకవైపు పాఠశాలలో విద్యా బోధనా, మరోవైపు ఎన్నికల విధులు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న తరుణంలో ఇలాంటి విధానాలు విద్యార్థుల బోధనాభ్యసన ప్రక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఉపాధ్యాయులను ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు పంపించడం కంటే, ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకే బాధ్యతలు అప్పగించి, అవసరమైన పర్యవేక్షణను సంబంధిత విద్యాశాఖ అధికారులు చేపట్టడం సముచితంగా ఉంటుందన్నారు. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను అనుమానించే, అవమానించే దృక్పథంతో కాకుండా, వారిని విశ్వసించే విధంగా వ్యవహరించాలని వారు కోరారు. ఉపాధ్యాయుల సహకారం, భాగస్వామ్యం లేకుండా విద్యారంగంలో ప్రవేశపెట్టే సంస్కరణలు ఆశించిన ఫలితాలను ఇవ్వవన్నారు. ఉపాధ్యాయులను గౌరవిస్తూ, వారి వృత్తిపరమైన ఆత్మగౌరవాన్ని కాపాడుతూ పరీక్షల నిర్వహణకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని వారు కోరారు, పైగా పరిశీలకులుగా వెళ్లే ఉపాధ్యాయులకు ఎటువంటి అలవెన్సులు ప్రకటించక పోవడం, సుదూర ప్రాంతాలకు విధులు కేటాయించడం అంటే ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలు-1 నిర్వహణకు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పరిశీలకులుగా నియమించే విధానాన్ని తక్షణమే పునఃపరిశీలించాలని, ఉపాధ్యాయులపై అనవసరమైన అపనమ్మకాన్ని కలిగించే, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఆదేశాలను తక్షణం ఉపసంహరించుకోవాలని.భవిష్యత్తులో పరీక్షల నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు జి.గోపీనాథ్, యస్.ఏజాస్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి కడప నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.కరీముల్లా, పి.హిపాజతుల్లా, సిద్దవటం మండల అధ్యక్షులు వై.రామకేశవ తదితరులు పాల్గొన్నారు.

బాపురం నుంచి ఉరుకుందకు పాదయాత్ర

:-ఈరన్న స్వామికి 101 కొబ్బరికాయల మొక్కు!







కౌతాళం నవంబర్ 09 ప్రజా జ్యోతి బాపురం ఎంపీటీసీ వెంకట్ రెడ్డి ప్రత్యేక పాదయాత్ర చూడి ఉలిగయ్యకు జెడ్పీ చైర్మన్ పదవి దక్కాలని స్వామివారికి మొక్కు! బాపురం ఎంపీటీసీగా విజయం సాధించిన వెంకట్ రెడ్డి తన మొక్కును ఘనంగా తీర్చుకున్నారు. బాపురం గ్రామం నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఉరుకుంద ఈరన్న నరసింహస్వామి ఆలయం వరకు పాదయాత్రగా చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈరన్న స్వామివారికి 101 కొబ్బరికాయలు సమర్పించి ప్రత్యేక మొక్కు చెల్లించుకున్నారు. కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా చూడి ఉలిగయ్యకు అవకాశం దక్కాలని కోరుకుంటూ వెంకట్ రెడ్డి ఈ మొక్కు పెట్టుకున్నట్లు తెలిపారు. మొక్కు కోసం పాదయాత్ర.101 కొబ్బరికాయల సమర్పణ ఉరుకుంద ఈరన్న స్వామిపై భక్తి చాటుకున్న బాపురం ఎంపీటీసీ వెంకట్ రెడ్డి! భక్తి చాటుకున్న వెంకట్ రెడ్డి ఆయన వెంట గ్రామస్తులు భారీ సంఖ్యలో పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో బాపూరం గ్రామస్తులు శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి మాజీ చైర్మన్ శివ మోహన్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ పదవి ఉయ్యూరు అనురాధికాకు దక్కేనా...!!







లేక జనసేన పార్టీ రాజబాబు కు దక్కేనా...!!

కో ఆప్షన్ సభ్యుడిగా నాగరాజును నియమించాలి...!!!

పలువురు టిడిపి నేతలు వేడుకోలు..!!

జి.కొండూరు :(సెప్టెంబర్ 09,,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు): జి.కొండూరు మండలంలో జరిగిన జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఎంపీపీగా కోడూరు గ్రామానికి చెందిన గీర అనిత మహిళా గెలుపొందారు. అలాగే జడ్పిటిసిగా పినపాక గ్రామానికి చెందిన బీసీ మహిళ వేములకొండ రేవతి చంద్రికా విజయం సాధించారు.అలాగే 16 ఎంపీటీసీ స్థానాల్లో....13 ఎంపీటీసీ స్థానాలను అధికార తెలుగుదేశం ప్రభుత్వం కైవసం చేసుకుంది. ఈ తరుణంలో జి. కొండూరు 2వ సిగ్నెంట్ నుండి 424 మెజార్టీతో ఎంపీటీసీగా గెలుపొందిన ఉయ్యూరు అనురాధిక బీసీ మహిళ కావడంతో. వైస్ ఎంపీపీ పదవి అనురాధికాకు ఇవ్వాలని జి.కొండూరు చెందిన పలువురు టిడిపి నేతలు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. అలాగే గడ్డ మణుగు సెగ్మెంట్ నుండి గెలుపొందిన గుజ్జర్లపూడి సాంబశివరావు... అలాగే కుంటముక్కల నుంచి.. జయలక్ష్మి కి వైస్ ఎంపీపీ పదవి ఇవ్వాలని పార్టీ నాయకులు అధిష్టానాన్ని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. వీరు కాక మరి కొందరు వైస్ ఎంపీపీ పదవిపై ఆశ పెట్టుకున్నారు. ఈ తరుణంలో మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాదు మాత్రం జి.కొండూరు వైస్ ఎంపీపీ పదవిని కూటమిలో భాగస్వామ్యం అయిన జనసేన పార్టీ వెల్లటూరు నుంచి పోటీ చేసిన కుంటముక్కల రాజబాబుకు వైస్ ఎంపీపీ పదవి ఇచ్చేటందుకు జనసేన పార్టీ అధిష్టానానికి మాట ఇచ్చినట్లు.... మరొక వైపు ప్రచారం జరుగుతుంది. ఏది....ఏమైనా వైస్ ఎంపీపీ పదవి ఎవరికి దక్కుతుందో... తెలియాలంటే గ్రామపంచాయతీ ఎన్నికలు.... పూర్తయ్యే వరకు ఆగాల్సిందే. అలాగే జి.కొండూరు 1వ సెగ్మెంట్ నుండి ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమి చెందిన పజ్జురు నాగరాజుకు కో-ఆప్షన్ సభ్యుడి గా పార్టీ అధిష్టానం ఇవ్వాలని తర్వాత వైస్ ఎంపీపీ పదవి ఇవ్వాలని పలువురు జి.కొండూరు టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అధిష్టాన దృష్టికి తీసుకువెళ్లన్నట్లు ప్రచారం జరుగుతుంది .కో-ఆప్షన్ సభ్యుడిగా పజ్జూరు నాగరాజు కి ప్రకటించడం వలన పార్టీకి మేలే జరుగుతుందని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

కార్తీక మాసం తొలి సోమవారం..

భక్తులతో కిటకిటలాడిన ఉరుకుంద పుణ్యక్షేత్రం!



కౌతాళం నవంబర్ 09 ప్రజాజ్యోతి కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఉరుకుంద పుణ్యక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో ఉరుకుంద క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

నివాళులు అర్పించిన మాజీ సర్పంచ్ పంపాపతి గౌడ...

తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్

ఆధ్వర్యంలో అంత్యక్రియలకు 5,000 ఆర్థిక సహాయం ....



కౌతాళం,నవంబర్ 09 ప్రజా జ్యోతి మండలంలోని వల్లూరు గ్రామంలో అకస్మికంగా ఏసప్ప మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ పంపాపతి గౌడ మృతి చెందిన కుటుంబానికి వెళ్లి ఏసప్ప మృతదేహానికి నివాళులు అర్పించి, ప్రగాఢ సంతపం తెలిపారు. అనంతరం అడివప్ప గౌడ్ ఆదేశాల మేరకు అంత్యక్రియలకు 5,000 రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పంపాపతి గౌడ మాట్లాడుతూ ధైర్యంగా ఉండండి, మీ కుటుంబానికి అండగా అడివప్ప గౌడ్ అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు తెలిపారు. పంపాపతి గౌడ వెంట ఆది బసవరాజ్ గౌడ్ మరియు ఇతరులు ఉన్నారు.

గొల్లప్రోలులో ఎస్సీ బరియల్ గ్రౌండ్ స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ దివిజా సంపతి



గొల్లప్రోలు ప్రజా జ్యోతి గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలోని రెండవ వార్డు ఎస్సీ బరియల్ గ్రౌండ్ స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ దివిజా సంపతి సోమవారం పరిశీలించారు. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా మంజూరైన నిధులతో ఈ బరియల్ గ్రౌండ్‌ను నూతనంగా నిర్మించనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన బరియల్ గ్రౌండ్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అతి త్వరలోనే టెండరు ప్రక్రియను పూర్తి చేసి, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని అక్కడ ఉన్న ప్రజలకు ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ మడికి శ్రీను, అసిస్టెంట్ ఇంజనీర్ ఎమ్.డి అహ్మద్ అలీషా, అమినిటీ సెక్రటరీలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మేడిశెట్టి బాబీ

--తమ విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీటీసీలు

--కాబోయే ఎంపీపీ మేడిశెట్టి బాబీకి శుభాకాంక్షలు తెలిపిన పర్వత ప్రసాద్



కాకినాడ జిల్లా నవంబర్ 9 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) శంఖవరంలోని ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ నివాసంలో గౌరంపేట ఎంపీటీసీ, శంఖవరం మండల కాబోయే నూతన ఎంపీపీ మేడిశెట్టి బాబీ, పెదమల్లాపురం ఎంపీటీసీ పసగడుగుల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. తమ విజయానికి కృషి చేసి సహకరించినందుకు ఈ సందర్భంగా పర్వత ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం శంఖవరం మండల నూతన ఎంపీపీగా బాధ్యతలు చేపట్టనున్న మేడిశెట్టి బాబీకి మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బచ్చల గంగ, తుని ఆత్మ జోన్ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, శంఖవరం మండలం జనసేన అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టికెట్ ఇస్తే సర్పంచ్ పదవికి పోటీకి సై అంటున్న టిడిపి నాయకులు....!!!

జి.కొండూరు :(సెప్టెంబర్ 09,,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు): ఈనెల 26వ తేదీన జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం టికెట్ ఇస్తే.... తెలుగుదేశం పార్టీ తరఫున సర్పంచ్ గా పోటీ చేయడానికి పలును నాయకులు పావులు కుదుపుతున్నారు. సర్పంచ్ గా పోటీ చేయడానికి అరడజను మంది ఆశవాహులు ఉన్నప్పటికీ... సర్పంచ్ పదవిని గెలుపొందాలంటే మంచి మనసున్న నాయకుడు, గ్రామ ప్రజల్లో మంచి ఆదరణ కలిగిన నాయకుడు, అర్థ బలం...అంగ బలం...ఆర్థిక పుష్టి ఉన్న నాయకుడు సర్పంచు పదవిని కైవసం చేసుకోగలరు. నేడు రాజకీయాలు మారిపోయాయి. సర్పంచ్ గా పోటీ చేసే వ్యక్తి కనీసం ఒక కోటి రూపాయలను ఖర్చు పెట్టే నాయకుడై ఉండాలి. అలాగే గ్రామంలో అందరితో కలిసి,మెలిసి ఉండే నాయకుడై ఉండాలి. ఇన్ని లక్షణాలు ఉంటేనే సర్పంచ్ కుర్చీని కైవసం చేసుకునే పరిస్థితి..!! డబ్బులు ఉన్నా ఖర్చుపెట్టిన... మాట ఉచ్చారణ సక్రమంగా లేకపోతే...అందరిని కలుపుకొని పోకపోతే.... ఎంత నాయకుడ్ని అయినా ఓటర్ల ఓడించి తీరుతారు. ఇలాంటి పరిస్థితుల్లో జి.కొండూరు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీకి సై...అంటున్నా తెలుగు తమ్ముళ్లు సీటు కోసం ఎవరు ప్రయత్నాలు వారు చేస్తున్నారు. వీరిలో ప్రధానంగా తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జురు విజయ్ ఎదుటి వారితో సరైన పలకరింపు మాట మంచితనం కలిగిన నాయకుడిగా.... బంధుమిత్ర బలం అన్ని వర్గాల సపోర్టు కలిగిన యువనేతగా... ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడిగా ఓటర్లు లో మంచి ఆదరణ ఉందని చెప్పవచ్చు. గ్రామంలో టెంట్ హౌస్ ద్వారాను.... తాగునీటి వాటర్ ప్లాంట్ ద్వారాను గ్రామంలో ప్రతి ఒక్కరితో మంచి పరిచయాలు ఉన్నాయి. అర్థబలం...అంగభాగం కలిగిన నాయకుడు పజ్జురు విజయ్ కి టికెట్ ఇస్తే... టిడిపి గెలుపు ఖాయమని పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. అలాగే మరొక నాయకుడు తెలుగుదేశం పార్టీ మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జురు వెంకటేశ్వరరావు(బుల్లి) మొదటి నుండి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వస్తున్నారు. ప్రజా సమస్యలపై మంచి అవగాహన కలిగి ఉంది. అర్థబలం అంగ బలం కలిగిన నాయకుడు అలాగే మొదటి నుండి రాజకీయాల్లో గ్రామంలో అందరితో మంచి పరిచయాలు కలిగి ఉన్నాడు. గ్రామంలో మంచి బంధుత్వం అందరితో మంచి పరిచయాలు కలిగి ఉన్నాడు. మొదటి నుంచి సర్పంచ్ టికెట్ నాదేనంటూ గట్టి నమ్మకంతో ఉన్నాడు.పజ్జురు వెంకటేశ్వరరావు(బుల్లి) టికెట్ ఇస్తే గెలుపు సునాయసమని టిడిపి నేతలు,కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఇద్దరు కాక మరొక పేరు పజ్జురు పద్మనాభరావు ఈయన రాజకీయాలకు కొత్త అయిన...మంచి బంధుత్వం కలిగి గ్రామంలో మంచి ఆదరణ ఉంది. ఈ నాయకుడికి అర్థ బలం...అంగ బలం....ఆర్థిక పుష్టిబలం సమృద్ధిగా కలిగి ఉన్నాడు. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి వేములకొండ నవీన్ గాని, వేములకొండ సాంబయ్య గాని సర్పంచ్ గా పోటీ చేస్తే పజ్జురు పద్మనాభరావు టిడిపిలో పోటీకి నిలబడతారా....? అనే ప్రశ్న ఓటర్లలో ఉంది. ఎందుకంటే పజ్జురు పద్మనాభ రావు వేములకొండ కుటుంబంతో బంధుత్వ సంబంధాలు ఉన్నాయి. ఏది....ఏమైనా సర్పంచ్ అభ్యర్థి ఎవరో...? తెలియాలంటే గ్రామ కమిటీ జరగాలి.ఆ గ్రామ కమిటీలో ఎవరు అభ్యర్థిని



నిర్ణయిస్తుందో....!! నేడు రేపు లోగా.. సర్పంచ్ అభ్యర్థి ఎవరో తెలుస్తుంది వేచి చూద్దాం....!!

జొన్నలగడ్డ చౌదరి ఆధ్వర్యంలో ఎంపీటీసీలకు ఘన సన్మానం





తాళ్లపూడి, నవంబర్ 9, ప్రజాజ్యోతి న్యూస్ తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో కూటమి తరఫున తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. మలకపల్లి గ్రామం నుండి ఎంపీటీసీ 1 గా గెద్దం వేగులియ్య, ఎంపీటీసీ 2 గా గెద్దం చినబాబు (జాన్) విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీలను కొవ్వూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపాటి ప్రకాశం, చెరుకూరి వెంకట్రావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయి చౌదరి మాట్లాడుతూ ఇంతటి విజయాన్ని అందించిన మలకపల్లి గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మలకపల్లి గ్రామ అభివృద్ధికి కూడా అన్ని విధాలుగా సహకరిస్తామని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీలు గెద్దం వేగులియ్య, గెద్దం చినబాబు (జాన్)లు మాట్లాడుతూ తమను గెలిపించిన మలకపల్లి గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకుల సహకారంతో గ్రామంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపడతామని వారు తెలిపారు. అనంతరం ఇంతటి ఘన విజయానికి కారకులైన జొన్నలగడ్డ సుబ్బరాయి చౌదరి, మద్దిపాటి ప్రకాశంలను నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీలు మరియు తెలుగు యువత నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మద్దిపాటి రామారావు, ఇమ్మని రాధాకృష్ణ, మద్దుకూరి బుచ్చిరాయుడు, మద్దుకూరి శ్యాం సుందరం, పోకనాటి ముత్యాలు, గెద్దం జగజ్జీవన్ రావు, రాపాక శ్యామ్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడమే జాతీయ న్యాయ సేవల దినోత్సవం ప్రధాన లక్ష్యం

న్యాయ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: సీనియర్ సివిల్ జడ్జి ఎ. శోభారాణి

ప్రజా జ్యోతి నందికొట్కూరు నందికొట్కూరు పట్టణంలోని స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎ. శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నందికొట్కూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్యానెల్ న్యాయవాదులు, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎ. శోభారాణి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 9వ తేదీన జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని తెలిపారు. 1987లో ఆమోదించబడిన లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం 1995 నవంబర్ 9వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వివరించారు.సమాజంలోని పేదలు, నిరుపేదలు, బలహీన వర్గాలు, వెనుకబడిన ప్రజలకు ఉచితంగా న్యాయ సహాయం అందించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు న్యాయానికి అడ్డంకిగా మారకూడదని, ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో న్యాయ సేవా సంస్థలు పనిచేస్తున్నాయని వివరించారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది తమకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయ అవకాశాలను వినియోగించుకోలేకపోతున్నారని, అలాంటి వారికి న్యాయ సేవలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. అర్హులైన వారికి ఉచిత న్యాయవాదుల సహకారం అందించడంతో పాటు లోక్ అదాలత్‌ల ద్వారా వివాదాలు, కేసులను సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వివిధ న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సామాన్య ప్రజలకు న్యాయాన్ని మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ హక్కులు, చట్టపరమైన అవకాశాల గురించి తెలుసుకొని న్యాయ సేవా సంస్థల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శరభయ్య, ఉపాధ్యక్షులు కేశవులు, ప్యానెల్ న్యాయవాదులు కొంగర వెంకటేశ్వర్లు, మద్దయ్య, సీనియర్ న్యాయవాదులు నజీర్ అహ్మద్, సురేష్ కుమార్ తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



నిట్రవట్టి గ్రామంలో ఘనంగా అభినందన సభ

జడ్పీటిసి గా ఎన్నికైన ఎం. వైశాలికి అభినందనలు తెలిపిన ఆలూరు నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ వైకుంఠం శివప్రసాద్



హొలహర్వి మండలం, నవంబర్ 09 ప్రజాజ్యోతి న్యూస్ :- హొలహర్వి మండల పరిధిలోని నిట్రవట్టి గ్రామంలో అత్యంత వైభవంగా అభినందన సభ నిర్వహించారు.ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన జడ్పిటిసి, ఎంపీటీసీ లకు మండల నాయకులు అభినందనలు తెలియజేస్తూ ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆలూరు నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ వైకుంఠం శివప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ, వైకుంఠం జ్యోతి సమక్షంలో హొలహర్వి మండలం ఎంతో అభివృద్ధి చెందిందని, మండల అభివృద్ధికి కొన్ని కోట్ల రూపాయలు కేటాయించి తోడ్పడ్డారని తెలిపారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు ఎన్నికైన నాయకులు అభివృద్ధికి తోడ్పడి ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అసుండి శ్రీధర్, మాజీ మండల కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ ఈ విజయం కార్యకర్తదే అని అన్నారు. కార్యకర్తలకు గెలుపొందిన వారికి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ ప్రహ్లాద్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రకాష్.ఎల్ ఎల్ సి చైర్మన్ మల్లన్న పూజారి, రాజన్న స్వామి, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ కన్వీనర్లు, సీనియర్ నాయకులు, కూటమి నాయకులు, బీజేపీ నాయకులు, బీజేపీ ఇంచార్జ్ తిమ్మప్ప గారు, బసవరాజు, మండల బీజేపీ కన్వీనర్ సురేష్, జనసేన నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నైతిక విజయం మాదే.. ప్రజాక్షేత్రంలో వైసీపీ బలంగా ఉంది

- వైసీపీ నాయకులు



బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 09 (ప్రజా జ్యోతి) బద్వేల్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వరకు రాజకీయంగా, నైతికంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే పైచేయి అని వైసీపీ నాయకులు పెద్ద పోలిరెడ్డి, రవిచంద్రారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నాగభూషణం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ టీడీపీ నాయకులు రాజకీయ అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకోవడం, స్క్రూటినీ ప్రక్రియకు హాజరుకాకుండా ఆటంకాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడి, అనంతరం విజయోత్సవాలు జరుపుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చెప్పుకోలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి తమ పాలనను వివరించలేక, అడ్డదారుల్లో విజయం సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ప్రతి రాజకీయ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారని, ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజాక్షేత్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన ఆదరణ ఉందని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగిస్తామని వైసీపీ నాయకులు స్పష్టం చేశారు.

కార్తీక మాస శోభ.. శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

- ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు



పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :హరహర మహాదేవ.. శంభో శంకరా.. అంటూ శివనామ స్మరణతో శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శివపార్వతులకు అత్యంత ప్రీతికరమైన పవిత్ర కార్తీక మాసం నేటి నుంచి ప్రారంభం కావడంతో శైవక్షేత్రాల్లో ఆధ్యాత్మికత నెలకొంది. హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానాన్ని కలిగిన కార్తీక మాసంలో దీపారాధన, ఉపవాసం, అభిషేకాలు, శివదర్శనం చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తుల విశ్వాసం.కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా పొందూరు మండల కేంద్రంలోని అగ్రహారంలో వెలసియున్న ప్రముఖ ప్రసిద్ధి గాంచిన శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి ఆలయ ప్రధాన అర్చకులు ఆరవిల్లి శేఖర్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చనలతో పరమేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు శివదర్శనం కోసం తరలివచ్చి దీపాలు వెలిగించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.

రాచపల్లి పీహెచ్‌సీలో ఈ సంజీవని కార్యక్రమంపై సమీక్షించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

--ప్రతి ఇంటికీ ఈ సంజీవని కార్యక్రమంపై అవగాహన కల్పించాలి

--ఆశా, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందేలా చర్యలు

--రోగుల వైద్య వివరాలు ఈ సంజీవని హెల్త్ ఎక్స్ పోర్టల్‌లో నమోదు చేయాలి

కాకినాడ జిల్లా నవంబర్ 9 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ప్రత్తిపాడు మండలం రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, త్వరలో అమలు చేయనున్న ఈ సంజీవని కార్యక్రమం పై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజలకు అందనున్న వైద్య సేవలు, ప్రయోజనాలను వైద్యాధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేఎన్‌డీ (నోన్ సిటిజన్ డ్రైవ్)లో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతి కుటుంబానికి ఈ సంజీవని కార్యక్రమంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఈ సంజీవని హెల్త్ ఎక్స్ పోర్టల్‌లో వైద్య వివరాలు

ప్రతి రోగికి సంబంధించిన ఆరోగ్య సమాచారం, వైద్య చికిత్స వివరాలను సంజీవని హెల్త్ ఎక్స్ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రుల్లోనూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. రోగికి సంబంధించిన కేస్‌షీట్ వివరాలు అందుబాటులో ఉండటంతో తదుపరి వైద్య చికిత్స సులభతరం అవుతుందన్నారు. అవసరమైన సందర్భాల్లో స్పెషలిస్టు వైద్యులతో టెలీ కన్సల్టేషన్ ద్వారా సంప్రదింపులు జరిపే సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, మందుల నిల్వలు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి, విధులకు సకాలంలో హాజరవుతున్న తీరును సమీక్షించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న మందులను రోగులకు తప్పనిసరిగా అందించాలని, బయట మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కల్పించకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, ప్రయోగశాల, మరుగు దొడ్లలో పరిశుభ్రత పాటించాలని, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలు, చిన్నారులకు నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాలు, ప్రయోగశాల పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ లక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రశాంతి, ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం సూర్యప్రభ ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, టాటా జిల్లా సంజీవని కార్యక్రమ కోఆర్డినేటర్, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గీతాసుధ, ఉషశ్రీ, వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, స్వర్ణ గ్రామ అధికారులు పాల్గొన్నారు.

బుట్టాయిగూడెం శివాలయంలో ఘనంగా అన్నప్రసాద వితరణ

తండ్రి జ్ఞాపకార్థం అన్నప్రసాద సేవ చేపట్టిన కుమారుడు బాలు
కూనవరానికి చెందిన శక చిరంజీవి జ్ఞాపకార్థం కార్యక్రమం



ఎటపాక, నవంబర్ 09 (ప్రజాజ్యోతి): పవిత్ర సోమవారం సందర్భంగా ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని శ్రీశివాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కూనవరం గ్రామానికి చెందిన దివంగత శక చిరంజీవి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బాలు ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమానికి ముందుకు రావడంపై భక్తులు అభినందనలు తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో ప్రతి సోమవారం ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకొస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావుతో పాటు స్థానిక గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఇరాన్‌పై మళ్లీ యుద్ధం..

అత్యంత అసంభవం:

ట్రంప్ : ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో మరోసారి యుద్ధం చేయాల్సిన పరిస్థితి తలెత్తే అవకాశాలు అత్యంత తక్కువ అని అన్నారు. అయితే.. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు, హోర్ముజ్ జలసంధిని మళ్లీ తెరిచే అంశాలపై గట్టి ఒప్పందం కుదరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ డీల్‌కు ఇరాన్ అంగీకరించకపోతే తాము మరోసారి సైనిక దాడులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా 3 విమాన వాహక యుద్ధనౌకలను మోహరించిందని, అవి పూర్తిస్థాయిలో పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలు సహా కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా గుర్తించినట్లు వెల్లడించారు. అయితే.. వాటిని ధ్వంసం చేస్తే పునర్నిర్మాణానికి పదేళ్ల సమయం పట్టొచ్చని, అందుకే అలాంటి చర్యలు తీసుకోవడం తనకిష్టం లేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పశ్చిమాసియా దేశాలు దౌత్య ప్రయత్నాలను వేగవంతం చేశాయి. ఖతార్ రాజుతో ట్రంప్ చర్చలు జరిపారు. మరోవైపు.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, పాకిస్థాన్, టర్కీ సహా పలు దేశాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. అయితే.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాత్రం చర్చల్లో తక్షణ పురోగతి కనిపిస్తోందని చెప్పలేమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవని ఆయన వ్యాఖ్యానించారు.

కూకట్‌పల్లిలో భారీ అగ్నిప్రమాదం..

గోదాములో ఎగిసిపడ్డ మంటలు

హైదరాబాద్ : కూకట్ పల్లిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పేపర్ టీ కప్పులు, ప్లేట్ల తయారీ కంపెనీలో సోమవారంతెల్లవారుజామున మంటలు చెలరేగాయి. తరువాత పక్కనే ఉన్న నెయ్యి, కుర్‌కురే, హల్దీరామ్ స్టాక్ గోదాములకు వ్యాపించాయి. మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. నాలుగు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేసారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీలైనన్ని నిధులు తీసుకొచ్చి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి

బాక్స్ టైప్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన
పాల్గొన్న మంత్రి పొన్నం, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి 46వ డివిజన్ లో యూడిఐఎఫ్ నిధులతో 1.5 కోట్ల తో బాక్స్ టైప్ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగని శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, మున్సిపల్ కమిషనర్ ప్రవుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఆరు పర్యాయాల ఎన్నికల చరిత్రలో తొలిసారి చొప్పెల్ల ఎంపీటీసీ-2 స్థానాన్ని కైవసం చేసుకున్న టీడీపీ

ఆలమూరు, నవంబర్ 9 (ప్రజాజ్యోతి): మండల పరిషత్ వ్యవస్థ ప్రారంభమైన 1995 సంవత్సరం నుంచి 2026 వరకు ఆలమూరు మండలంలో జరిగిన ఆరు పర్యాయాల ఎంపీటీసీ ఎన్నికల చరిత్రలో చొప్పెల్ల గ్రామం నుంచి టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ముఖ్యంగా 2026 నవంబర్ 5వ తేదీన నిర్వహించిన ఎంపీటీసీ ఎన్నికల్లో చొప్పెల్ల గ్రామంలోని ఎంపీటీసీ-2 స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మేరేటి సాయిదుర్గ పోటీ చేసి విజయం సాధించి సరికొత్త రాజకీయ చరిత్రకు శ్రీకారం చుట్టారు.గతంలో జరిగిన ఐదు పర్యాయాల ఎన్నికల్లో టిడిపికి సాధ్యం కాని విజయాన్ని ఆరో పర్యాయం ఎన్నికల్లో సాధించడం ద్వారా ఆమె చొప్పెల్ల గ్రామ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ విజయం కేవలం ఒక ఎన్నికల ఫలితంగానే కాకుండా, గ్రామంలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు, కూటమి పార్టీల ఐక్య కార్యాచరణకు, ప్రజల మద్దతుకు నిదర్శనంగా నిలిచింది.ఈ సందర్భంగా మేరేటి సాయిదుర్గ మాట్లాడుతూ తన విజయానికి సహాయ సహకారాలు అందించి, వెన్నంటి నిలిచిన కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావుకు, జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ప్రచారంలో అందించిన సహకారం,



చూపిన ఆదరణ మరువలేనివని పేర్కొన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా తనపై నమ్మకం ఉంచి, అమూల్యమైన ఓటు హక్కును వినియోగించి తనను గెలిపించిన దైవ సమానులైన ఓటరు మహాశయులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఆరు పర్యాయాల ఎన్నికల చరిత్రలో తొలిసారి తెలుగుదేశం పార్టీకి నమోదైన ఈ విజయం చొప్పెల్ల గ్రామ రాజకీయాల్లో ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిపోనుంది.

ఆస్పరిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ఆస్పరి, నవంబర్ 9 (ప్రజా జ్యోతి): ఆస్పరి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయాలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆస్పరి జడ్పీటీసీగా విజయం సాధించిన బసవరాజుతో పాటు మండలంలో ఐదుగురు ఎంపీటీసీ స్థానాల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు.ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి విజేతలకు సూచించారు. ప్రజల విశ్వాసంతో లభించిన ఈ విజయాన్ని బాధ్యతగా భావించి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పిలుపునిచ్చారు.ప్రజాప్రతినిధులుగా పదవులు చేపట్టడం అంటే ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలు వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకు నేందుకు వచ్చినప్పుడు సానుకూలంగా స్పందించి, సాధ్యమై నంత త్వరగా పరిష్కారం



చూపేందుకు ప్రయత్నించాలని అన్నారు.ఆస్పరి మండల అభివృద్ధికి జడ్పీటీసీ, ఎంపీటీసీ ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల వారీగా ప్రజల అవసరాలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపాలని తెలిపారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల పక్షాన నిలవాలని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి విజేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి, ఆస్పరి మండల సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం అందుకున్న జడ్పీటీసీ బసవరాజు, ఐదుగురు ఎంపీటీసీలు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాగిత సుధీర్ బాబు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక



బాపట్ల నవంబర్ 9(ప్రజా జ్యోతి జిల్లాప్రతినిధి)బాపట్ల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబును ఎంపిక చేశారు. ఈ మేరకు బాపట్ల పట్టణంలోని 44 వార్డుల కన్వీనర్ల సమావేశం సోమవారం మాజీ ఉపసభాపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి అధ్యక్షతన నిర్వహించారు రాబోయే మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జరిగిన ఈ సమావేశంలో కాగిత సుధీర్ బాబును చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేస్తూ తీర్మానం చేశారు. ఈ నిర్ణయానికి 44 వార్డుల కన్వీనర్లు, పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయ భూములు కబ్జాదారులకు గురికాకూడదని కమిటీ సభ్యులు ఆవేదన





మండల కేంద్రంలోని 4వ వార్డులో ఉన్న అత్యంత పురాతనమైన శ్రీశ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ పరిసరాలపై అక్రమార్కుల కన్ను పడింది. ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.ఈ విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు అత్యవసరంగా సమావేశమై ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకోవాలని నిర్ణయించారు. అనంత రం సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. తరతరాలుగా భక్తుల నమ్మకానికి ఆలయ ఉత్సవాలకు నిలయంగా ఉన్న ఈ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందంటూ దేవాలయం ఎదురుగా ఉన్న స్థలాలన్నీ కాపాడండి మహాప్రభూ అని కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయ భూముల సరిహద్దులను గుర్తించి తక్షణమే రక్షణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.తహశీల్దార్‌కు అర్జీ ఇచ్చిన వారిలో కమిటీ సభ్యులు అంజినేయులు, ప్రచండ, నవీన్, రమేష్, ఆది, రవి, మధు, బబ్లూ, కార్తీక్, చరణ్, ప్రభాకర్, రామాంజినేయులు, చంద్రబాబు మరియు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

బిజినెస్

‘చాయ్’ నుంచి ‘సోర్స్ కోడ్’ వరకు..
కార్పొరేట్ చరిత్రలో గూఢచర్యం కొత్తేం కాదు..!



ఇంటర్నెట్ డెస్క్: వైనీస్ ‘గూఢచారి’తో అమెరికా చిప్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అనైతిక బంధం టెక్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. ఈ ఘటనతో ‘పారిశ్రామిక గూఢచర్యం వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. శత్రువులను ఆర్థికంగా కుంగదీసేందుకు ఇదో బలమైన ఆయుధం. కొన్నిసార్లు ఇది బాధిత దేశాల ఆధిపత్యాన్ని, బలాబలాలను తారుమారుచేసిన సందర్భాలూ చరిత్రలో ఉన్నాయి. ‘ది గ్రేట్ ఇండియన్ రాబరీ’, ‘సబ్‌మెరైన్ కుంభకోణం’ వంటి ఘటనలే ఇందుకు ఉదాహరణ..!

వైనా ‘చాయ్’ దొంగిలించి..

భారతీయులకు ‘టీ’ అలవాటు చేసింది బ్రిటిషర్ల అన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ‘చాయ్’ పేటెంట్ హక్కులు మాత్రం బ్రిటన్‌వి కాదు. 19వ శతాబ్దంలో వైనా నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ ఈ వ్యాపారాన్ని దొంగిలించింది. ఇందుకోసం గూఢచర్యానికి పాల్పడింది. అప్పట్లో తేయాకు వ్యాపారానికి వైనా గుత్తాధిపత్యం వహించింది. ఆ దేశం నుంచి కొనుగోళ్లను ఆర్థిక భారంగా భావించిన బ్రిటన్.. టీ పరిశ్రమ రహస్యాలను తెలుసుకునేందుకు స్కాట్లాండ్ వృక్ష శాస్త్రవేత్త రాబర్ట్ ఫార్చూన్‌ను కార్పొరేట్ గూఢచారి వలే వైనాకు పంపించింది. వైనీస్ వ్యాపారి వేషధారణలో ఆ దేశ తేయాకు తోటలకు వెళ్లిన రాబర్ట్.. అత్యంత చాకచక్యంగా దాదాపు 20వేల మొక్కలు, విత్తనాలు, తేయాకు సాగుకు సంబంధించిన వాణిజ్య రహస్యాలను సేకరించారు. నాడు భారత్‌ను పాలిస్తున్న ఈస్ట్ ఇండియా కంపెనీకి వాటిని అందించారు. అలా తేయాకు సాగు భారత్‌కు చేరింది. అంతేకాదు.. భారతీయులకు తేయాకు పెంచడంపై శిక్షణ ఇచ్చేందుకు కొంతమంది వైనీస్ టీ వర్కర్లను కూడా నియమించుకున్నట్లు పలు అధ్యయనాలు పేర్కొన్నాయి.

అమెరికాకు తెలియకుండా..

1980ల్లో ప్రచ్ఛన్న యుద్ధం చివర్లో చోటుచేసుకున్న తోషిబా–కాంగ్స్‌బర్గ్ కుంభకోణం.. అంతర్జాతీయ వాణిజ్య చరిత్రలోనే అతిపెద్ద ఉల్లంఘనల్లో ఒకటిగా నిలిచింది. జపాన్‌కు చెందిన తోషిబా మెషిన్ కంపెనీ, నార్వేకు చెందిన కాంగ్స్‌బర్గ్ కంపెనీతో కలిసి.. నాటి సోవియట్ యూనియన్‌కు అధునాతన కంప్యూటర్ కంట్రోల్డ్ జచీజ మిల్లింగ్ మెషీన్ల (ప్రొపెల్లర్లు తయారు చేసే యంత్రాలు)ను విక్రయించింది. దీంతో పాటు న్యూమరికల్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌ను అక్రమంగా ఎగుమతి చేసింది. వాస్తవంగా సోవియట్‌కు ఈ టెక్నాలజీ విక్రయించకూడదనే జూజూవీ (పాశ్చాత్య దేశాల ఎగుమతి నియంత్రణ ఒప్పందం) నిబంధనలను ఉల్లంఘించి జపాన్ ఈ చర్యలకు పాల్పడింది. ఈ యంత్రాలను ఉపయోగించి తయారు చేసిన సోవియట్ సబ్‌మెరైన్‌ల ప్రొపెల్లర్లు మరింత నిశ్శబ్దంగా తయారయ్యాయి. దాంతో పాశ్చాత్య దేశాలు వాటిని గుర్తించడం కష్టమైంది. 1987లో ఈ విషయం బయటపడిన తర్వాత అమెరికా–జపాన్ సంబంధాలు దెబ్బతిన్నాయి. తోషిబా అధికారులపై నాడు అగ్రరాజ్యం కొంతకాలం ఆంక్షలు కూడా విధించింది.

ఐబీఎం వర్సెస్ హితాచీ..

అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ సంస్థ ఐబీఎం రహస్యాలను తెలుసుకునేందుకు జపాన్‌కు చెందిన హితాచీ కార్పొరేట్ గూఢచర్యానికి పాల్పడింది. 1982లో ఈ ఘటన జరిగింది. హితాచీకి చెందిన కొందరు ఉద్యోగులు ఐబీఎం కొత్తతరం మెయిన్‌ఫ్రేమ్ కంప్యూటర్లు, సోర్సు కోడ్ గురించిన రహస్య సాంకేతిక పత్రాలు, స్పెసిఫికేషన్లను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం కొన్ని కంపెనీలకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించారు. ఈ గూఢచర్యాన్ని ఎఫ్‌బీఐ అండర్‌కవర్ ఆపరేషన్ నిర్వహించి తెలుసుకుంది. దాంతో ఈ వ్యవహారం బయటపడింది. అనంతరం ఈ కేసు కోర్టుకెక్కగా.. హితాచీ తన నేరాన్ని అంగీకరించి జరిమానా చెల్లించింది.

ఎన్విడియా సీఈవో జేన్‌సన్‌పై దర్యాప్తు..

షాక్‌లో టెకీ ప్రపంచం



న్యూయార్క్: టెకీ ప్రపంచంలో సంచలన ఘటన జరిగింది. అమెరికాకు చెందిన ఎన్విడియా కంపెనీ సీఈవో జేన్‌సేన్ హువాంగ్‌పై వ్యక్తిగత దర్యాప్తు మొదలుపెట్టారు. వైనీస్ గూఢాచారితో ఆయన రిలేషన్‌లో ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో కంపెనీ బోర్డు సభ్యులు దర్యాప్తునకు పూనుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్వీడియా కంపెనీకి విశేషమైన గుర్తింపు ఉన్నది. అయితే కంపెనీ కానీ, దేశ రహస్యాలు బయటకు పొక్కడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు తెలిపారు. ఇక తాను మరో వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నట్లు జేన్‌సేన్ అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఆయన తన భార్య, పిల్లలకు క్షమాపణలు చెప్పారు. వైనీస్ వ్యాపారి అలిస్ హువాంగ్‌తో జేన్‌సేన్ వివాహేతర సంబంధాన్ని కొనసాగించినట్లు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే అలిస్ హువాంగ్.. బీజింగ్ స్పై అంటూ ఇటీవల అమెరికా మీడియాలో కథనం ప్రచురితమైంది. తాను చేసిన పనికి పూర్తి బాధ్యతలను తీసుకోనున్నట్లు జేన్‌సేన్ ప్రకటించారు. ఎన్విడియా కంపెనీ ఉద్యోగుల బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లు ఆయన అంగీకరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద టెకీ కంపెనీల్లో ఎన్వీడియా ఒకటి. ప్రస్తుతం అభివృద్ధిలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు చెందిన హార్డ్‌వేర్‌ను ఆ కంపెనీ రూపొందిస్తుంది. ఆ కంపెనీలో గత 30 ఏళ్లుగా జేన్‌సేన్ ఇంచార్జీగా ఉన్నారు. తైవాన్‌లో ఆయన జన్మించారు. తొమ్మిదేళ్ల వయసులో ఆయన ఫ్యామిలీతో అమెరికాకు వలసవెళ్లారు. ఓరేగాన్ స్టేట్ యూనివర్సిటీలో ఆయన గ్రాడ్యుయేషన్ చేశారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ల్యాబ్ పార్ట్నర్ లోరి మిల్స్‌ను ఆయన పెళ్లాడు. ఆమె కూడా ఎలక్ట్రికల్ ఇంజినీర్. ఆ జంటకు ఇద్దరు సంతానం. 1993లో ఎన్విడియాను హువాంగ్ స్థాపించారు. దానికి ముందు ఆయన ఏఎండీ చిప్ తయారీ కంపెనీలో చేశారు. గ్రాఫిక్స్‌ను ప్రాసెసింగ్ చేసే కంపెనీగా ఎన్వీడియాకు పేరున్నది. కంప్యూటర్ గేమ్స్‌కు కీలకమైన టెక్నాలజీని ఆ కంపెనీ తయారు చేస్తుంది. ప్రస్తుతం ఆ కంపెనీ తన ఫోకస్‌ను ఏఐకి మార్చింది. ఎన్వీడియా మైక్రోచిప్ కంపెనీ విలువ సుమారు 4.5 ట్రిలియన్ల డాలర్లు. ఓపెన్‌ఏఐ, మెటా సంస్థలకు చిప్‌లను డెవలప్ చేసి ఇస్తుంది. విదేశీ ఇంటెలిజెన్స్‌తో సంబంధాలు ఉన్న నేపథ్యంలో జేన్‌షేన్ హువాంగ్‌ను విచారించనున్నట్లు ఎన్వీడియా బోర్డు డైరెక్టర్లు ఓ ప్రకటనలో తెలిపారు. అపార అనుభవం, విశేష గుర్తింపు ఉన్న జేన్‌సేన్ హువాంగ్‌పై ఆ కంపెనీ దర్యాప్తు చేపట్టడం టెకీ ప్రపంచం నివ్వెరపోతున్నది. ప్రస్తుతానికి కంపెనీ లీడర్‌షిప్‌లో ఆయనే కొనసాగనున్నట్లు బోర్డు పేర్కొన్నది.

బ్యాంక్ షేర్ల మెరుపులు..
ఎట్టకేలకు ఇలా ముగిసింది



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, ఫార్మా షేర్లు పురోగమించడంతో బెంచ్ మార్క్ సూచీలు అస్థిర ట్రేడ్ సెషన్ ను సానుకూల నోట్‌తో ముగించాయి. సెన్సెక్స్ 107.25 పాయింట్లు లేదా 0.13 శాతం పెరిగి 81,106.65 వద్ద, నిఫ్టీ 58.25 పాయింట్లు లేదా 0.23 శాతం పెరిగి 25,044.65 వద్ద స్థిరపడ్డాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), ట్రెంట్, నెస్లే ఇండియా నిఫ్టీ 50లో టాప్ లాభాలు పొందాయి. విస్తృత మార్కెట్లో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 వరుసగా 0.55 శాతం, 0.1 శాతం పెరిగాయి. రంగాల వారీగా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ 3శాతానికి పైగా పెరిగి సహచరులను అధిగమించింది. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్ కేర్ కూడా మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ ఐటీ మాత్రం అత్యంత క్షీణించింది.

టెస్ట్ క్రికెట్‌లో ముష్ఫికర్ రహీం చరిత్ర..
తొలి బంగ్లా ఆటగాడిగా అరుదైన ఘనత

టెస్టుల్లో 7000 పరుగులు పూర్తి చేసిన తొలి బంగ్లాదేశ్ క్రికెటర్

వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఈ అరుదైన మైలురాయిని అందుకున్న ముష్ఫికర్

బంగ్లా తరఫున 5000, 6000 పరుగులు కూడా మొదట పూర్తి చేసింది ఇతనే

107 టెస్టులతో బంగ్లా తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగానూ రికార్డు



బంగ్లాదేశ్ సీనియర్ వికెట్ కీపర్–బ్యాటర్ ముష్ఫికర్ రహీం టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో 7000 పరుగులు పూర్తి చేసిన తొలి బంగ్లాదేశ్ క్రికెటర్‌గా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. వెస్టిండీస్‌తో సిల్హెట్ వేదికగా ఈరోజు ముగిసిన రెండో టెస్టు మ్యాచ్‌లో ముష్ఫికర్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టుకు దూరంగా ఉన్న 39 ఏళ్ల ముష్ఫికర్, రెండో టెస్టులో బరిలోకి దిగాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు అతను 7000 పరుగుల మార్క్‌కు 43 పరుగుల దూరంలో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 34 పరుగులు చేసి అవుటయ్యాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో, మ్యాచ్ ఐదో రోజు ఆటలో భాగంగా రోస్టన్ చేజ్ బౌలింగ్‌లో ఒక సింగిల్ తీసి 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఈ చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 49 పరుగులు చేసి అతను నాటౌట్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగుల లక్ష్య ఛేదనలో 184/4 స్కోరు వద్ద ఉండగా, వెలుతురు మందగించడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. బంగ్లాదేశ్ తరఫున టెస్టుల్లో 5000, 6000 పరుగుల మైలురాళ్లను కూడా తొలుత అందుకున్నది ముష్ఫికర్ రహీమే కావడం విశేషం. ప్రస్తుతం 7000 పరుగులతో అగ్రస్థానంలో ఉన్న అతను, రెండో స్థానంలో ఉన్న మోమినుల్ హక్ (5293) కంటే 1747 పరుగులు, ఇప్పటికే రిటైరైన తమీమ్ ఇక్బాల్ (5134) కంటే 1906 పరుగులు ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. 2005లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌పై టెస్టు అరంగేట్రం చేసిన ముష్ఫికర్ రహీం, బంగ్లాదేశ్ తరఫున అత్యధిక టెస్టులు ఆడిన ఆటగాడిగానూ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు 107 టెస్టులు ఆడిన అతను, దేశం తరఫున 100 టెస్టులు పూర్తి చేసిన ఏకైక ఆటగాడు. ఇప్పటికే వన్డే, టీ20 ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన ముష్ఫికర్, కేవలం టెస్ట్ క్రికెట్‌లో మాత్రమే బంగ్లాదేశ్‌కు తన సేవలు అందిస్తున్నాడు.

స్పోర్ట్స్

ఒకవైపు గాయాలు.. మరోవైపు భారత్ జోరు..
కివీస్‌కు కఠిన పరీక్ష!



న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా మరో విజయానికి సిద్ధమైంది. ఇప్పటికే వరుసగా రెండు వన్డేల్లో గెలిచి 2–0తో ఆధిక్యంలో ఉన్న భారత జట్టు.. మంగళవారం జరిగే మూడో వన్డేలోనూ విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా జరగనున్న ఈ పోరులో ఆతిథ్య న్యూజిలాండ్‌కు మాత్రం చావోరేవో పరిస్థితి. ఈ మ్యాచ్‌లో ఓడితే సిరీస్ చేజారినట్లే. మరోవైపు కీలక ఆటగాళ్ల గాయాలతో కివీస్ సతమతమవుతోంది. ఈ పరిస్థితుల్లో సొంతగడ్డపై భారత్‌ను అడ్డుకోవడం శాంట్నర్ సేనకు పెద్ద సవాలే. ఈ సిరీస్‌లో భారత బౌలర్లే ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు. పేస్ దళం ధాటికి కివీస్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. తొలి వన్డేలో 185 పరుగులకే కట్టడి కాగా.. రెండో మ్యాచ్‌లో 134 పరుగులకే కుప్పకూలింది. ముఖ్యంగా రెండో వన్డేలో గుర్నూర్ బ్రార్ 30 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ కూడా కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. ఈసారి కూడా ఇదే జోరు కొనసాగించాలని భారత్ భావిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్ విభాగం తీవ్ర ఒత్తిడిలో ఉంది. రెండో వన్డేలో డారిల్ మిచెల్ (55), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (31) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేదు. టాప్ ఆర్డర్ విఫలమవుతుండటంతో మిడిలార్డర్‌పై భారం పెరుగుతోంది. విల్ యంగ్, హెన్రీ నికోల్స్, టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్ ఈ మ్యాచ్‌లో బాధ్యత తీసుకోవాల్సి ఉంది. అయితే కివీస్‌కు మరో పెద్ద సమస్య గాయాలు. కుడి కాలి కండరాల గాయంతో సీనియర్ పేసర్ లాకీ ఫెర్గూసన్ చివరి రెండు వన్డేలకు దూరమయ్యాడు. రెండో మ్యాచ్‌లో హెల్మెట్‌కు బంతి తగలడంతో బ్లెయిర్ టిక్నర్ కూడా తదుపరి రెండు మ్యాచ్‌లు ఆడటం లేదు. అతడికి ఏడు రోజుల విశ్రాంతి తప్పనిసరి. దాంతో క్రిస్టియన్ క్లార్క్‌ను జట్టులోకి తీసుకున్నారు. దీంతో న్యూజిలాండ్ బౌలింగ్ విభాగం అనుభవలేమితో ఇబ్బంది పడే అవకాశముంది. భారత్ కూడా బ్యాటింగ్‌లో మెరుగుపడాల్సిన అవసరం ఉంది. తొలి వన్డేలో విరాట్ కోహ్లీ 74 పరుగులతో జట్టుకు అండగా నిలిచాడు. రెండో మ్యాచ్‌లో మాత్రం టాప్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఒక దశలో 113 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన భారత్‌ను కేఎల్ రాహుల్ అజేయంగా 26 పరుగులు చేసి ఆదుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయే సమయానికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ నాలుగు పరుగుల ఆధిక్యంలో ఉండటంతో విజయం దక్కింది. ఈసారి బ్యాటర్లు సమష్టిగా రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. సొంతగడ్డపై ఆడుతున్న న్యూజిలాండ్ ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని చూస్తోంది. టీ20 సిరీస్‌ను 2–3తో కోల్పోయిన కివీస్.. వన్డే సిరీస్‌లోనూ పరాభవం ఎదురుకాకుండా పోరాడాల్సిన పరిస్థితి. భారత బౌలర్ల జోరుకు కివీస్ బ్యాటర్లు అడ్డుకట్ట వేస్తారా? లేక గిల్ సేన మరో విజయంతో సిరీస్‌ను చేజిక్కించుకుంటుందా? అన్నది ఆసక్తికరం.

ఖవాజా చెప్పిందంతా నూటికి నూరు శాతం నిజం..
‘శాండ్‌పేపర్ గేట్’పై నోరు విప్పిన వార్నర్



ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 శాండ్‌పేపర్ గేట్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఘటనపై ఎనిమిదేళ్లుగా మౌనంగా ఉన్న ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్, ఎట్టకేలకు తన మౌనాన్ని వీడాడు. ఈ వివాదంపై ఇటీవల ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు పూర్తి మద్దతు ప్రకటించాడు. ఖవాజా చెప్పిందే నూటికి నూరు శాతం నిజమని, నిజానిజాలు బయటకు రావాల్సిన సమయం ఆసన్నమైందని వార్నర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పంచుకున్నాడు. ఈ వివాదంపై అప్పట్లో జరిగిన విచారణ ప్రక్రియను వార్నర్ తీవ్రంగా తప్పుబట్టాడు. అది లోపభూయిష్టంగా, హడావుడిగా జరిగిందని ఆరోపించాడు. “ఈ అంశంపై మాట్లాడి ఎనిమిదేళ్లు అవుతోంది. ఉస్మాన్ ఖవాజాకు నా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాను. నువ్వు చెప్పింది 100 శాతం నిజం. ఇప్పుడు అందరికీ నిజం తెలిసింది. ఎనిమిదేళ్ల తర్వాత ఎందుకు మాట్లాడుతున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ ఇది ఉస్మాన్ కథ, అతను నమ్మిన విషయం. అప్పట్లో కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉస్మాన్ కూర్చున్నాడు. కానీ అతడిని విచారించలేదు. ఇది ఎలాంటి సమగ్ర విచారణో నాకైతే అర్థం కావడం లేదు” అని వార్నర్ నిలదీశాడు.

ఈ వివాదం తన కుటుంబంపై చూపిన ప్రభావం గురించి వార్నర్ భావోద్వేగంగా మాట్లాడాడు. ఇటీవలే తన కుమార్తెలకు ఈ ఘటన గురించి వివరించాల్సి వచ్చిందని తెలిపాడు. “గత రెండు రోజులుగా నా కుమార్తెలకు అసలేం జరిగిందో వివరిస్తున్నాను. ముఖ్యంగా నా 12 ఏళ్ల కుమార్తె ఐవీ, అప్పట్లో మా చుట్టూ అన్ని కెమెరాలు ఎందుకున్నాయని, మేం టీవీలో ఎందుకు ఏడ్చామని అడిగింది. అది చెప్పడం చాలా కష్టంగా అనిపించింది. కానీ, ‘అమ్మాయిలూ, ఎప్పుడూ నిజమే చెప్పండి, ఎందుకంటే అబద్ధాలు ఏదో ఒకరోజు బయటపడతాయి’ అని వారికి చెప్పాను” అని వార్నర్ పేర్కొన్నాడు. ఈ కష్టకాలంలో తన కుటుంబంతో పాటు స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ కుటుంబాలు కూడా ఎంతో నరకాన్ని అనుభవించాయని గుర్తుచేసుకున్నాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్ సందర్భంగా శాండ్ పేపర్ తో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించిన ఘటన ఆస్ట్రేలియా క్రికెట్‌లో పెను దుమారం రేపింది. ఈ ఘటనలో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ మాత్రమే దోషులని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తేల్చింది. దీంతో స్మిత్, వార్నర్‌పై 12 నెలలు, బాన్‌క్రాఫ్ట్‌పై 9 నెలల నిషేధం విధించింది. కాగా, ఈ బాల్ ట్యాంపరింగ్ కుట్ర గురించి కేవలం ముగ్గురు ఆటగాళ్లకు మాత్రమే కాదని, పర్యటనలో ఉన్న జట్టు సభ్యులందరికీ ముందే తెలుసని ఖవాజా తెలిపాడు. “ఆ తప్పు మా అందరిదీ. కేవలం బ్యాటర్లు, బౌలర్లు లేదా సహాయక సిబ్బంది మాత్రమే కాదు.

ఇండస్ట్రీలోకి రాకముందే ముక్కుకు సర్జరీ చేయించుకున్నా.. ఆసక్తికర విషయాలు బయటపెట్టిన జాన్వీ కపూర్!



బాలీవుడ్ అందాల తార, దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సినిమాల్లోకి రావడానికి ముందు తన తల్లి శ్రీదేవి పెట్టిన కండిషన్లు, ఆమె ఇచ్చిన సలహాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అంతేకాదు.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి ముందే తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు కూడా చెప్పుకొచ్చారు. తొలుత తాను సినిమాల్లోకి వస్తానంటే తల్లి శ్రీదేవి పెద్దగా ఆసక్తి చూపించలేదని, అయితే ఆ తర్వాత తన నిర్ణయానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జాన్వీ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జాన్వీ కపూర్ తన తల్లి శ్రీదేవితో ఉన్న అనుబంధం గురించి ఎప్పటికప్పుడు పలు సందర్భాల్లో మాట్లాడుతూనే ఉంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా తన కెరీర్‌కు సంబంధించి తల్లి ఇచ్చిన సలహాలను గుర్తు చేసుకున్నారు. తాను సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు ఆ విషయాన్ని మొదట శ్రీదేవికి చెప్పానని, అయితే ఆమె వెంటనే అంగీకరించలేదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం అంటే సాధారణ విషయం కాదని, ఈ రంగంలోకి వస్తే జీవితాంతం నటనకే అంకితం కావాల్సి ఉంటుందని తన తల్లి చెప్పినట్లు వెల్లడించారు. ఈ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, పూర్తి నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందని శ్రీదేవి తనకు వివరించినట్లు చెప్పారు. మొదట్లో తనపై తల్లికి అంతగా నమ్మకం ఉండేది కాదని కూడా జాన్వీ పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో జాన్వీ చెప్పిన మరో విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల్లోకి రావడానికి ముందు తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. తన తల్లి సూచన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఆ తర్వాతే తనలో నటిగా కొనసాగగల లక్షణాలు ఉన్నాయని శ్రీదేవి భావించినట్లు చెప్పుకొచ్చారు. అయితే జాన్వీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె అందం, సినీ రంగ ప్రవేశానికి ముందు చేసిన మార్పుల గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఇప్పటికే పలుమార్లు తన వ్యక్తిగత రూపం, అందం గురించి జాన్వీ బహిరంగంగా మాట్లాడారు. అందం విషయంలో ఇతరులతో పోల్చుకోవడం సరికాదని, సోషల్ మీడియాలో కనిపించే అందమైన చిత్రాలను చూసి యువతులు తమను తాము తక్కువగా భావించుకోవద్దని సూచించారు.తన వ్యక్తిత్వం, అందం, కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాల్లో తల్లి ప్రభావం ఉందని జాన్వీ గతంలోనూ వెల్లడించారు.

బ్లాక్ అవుట్‌ఫిట్‌లో బ్యూటీ క్వీన్ త్రిప్తి దిమ్రి అందాల విందు





ఓటీటీలోకి వస్తున్న ‘గరివిడి లక్ష్మి’.. ఆనంది నటించిన బయోపిక్ ఎక్కడ చూడొచ్చంటే?

1980, 90వ దశకాల్లో తన జానపద పాటలు, బుర్రకథలు, కథాగానంతో ఉత్తరాంధ్ర ప్రజలను అలరించిన ప్రముఖ జానపద కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ‘గరివిడి లక్ష్మి’. టాలీవుడ్ నటి ఆనంది టైటిల్ రోల్‌లో నటించిన ఈ సినిమా అక్టోబర్ 17న థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. త్వరలోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం ‘గరివిడి లక్ష్మి’ సినిమా నవంబర్ 13, శుక్రవారం నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఓటీటీ విడుదల తేదీ, స్ట్రీమింగ్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడితే సినిమా డిజిటల్ రిలీజ్‌పై మరింత స్పష్టత రానుంది. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లా గరివిడి గ్రామానికి చెందిన జానపద కళాకారిణి లక్ష్మి జీవితంలోని సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. చిన్న వయసులోనే వివాహం చేసుకున్న లక్ష్మి, భర్తకు అప్పటికే మరో పెళ్లి జరిగిందని తెలుసుకుని జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితుల్లో ఆమె తల్లి దేవుడమ్మ తన కూతురికి అండగా నిలుస్తుంది. ఆ తర్వాత లక్ష్మికి బుర్రకథలు, జానపద పాటలపై ఆసక్తి పెరుగుతుంది. సత్తిబాబు పరిచయంతో అతడితో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభిస్తుంది. తన గాత్రంతో, కథాగానంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ క్రమంగా మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. అయితే ఆమె జీవితంలో పేరు ప్రఖ్యాతులతో పాటు అనేక చేదు అనుభవాలు కూడా ఎదురవుతాయి. లక్ష్మి జీవితంలో సత్తిబాబు పాత్ర ఎలాంటి మలుపులు తీసుకొచ్చింది? ప్రేమ పేరుతో అతడు ఆమెను ఎలా మోసం చేశాడు? ఆమె పాడిన పాటలు, సంపాదించుకున్న గుర్తింపును ఇతరులు ఎలా సొంతం చేసుకున్నారు? కళాకారిణిగా ఎదిగిన లక్ష్మి వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు ఏమిటి? అనే అంశాలను ఈ సినిమాలో చూపించారు.అంతేకాదు, లక్ష్మికి తిరిగి గుర్తింపు తీసుకురావడానికి రాంబాబు చేసిన ప్రయత్నాలు, ఆమె జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు కథలో కీలకంగా నిలుస్తాయి. ఒక జానపద కళాకారిణి ప్రయాణం, ఆమె పోరాటం, కళకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలను ఈ చిత్రం తెరపై ఆవిష్కరించింది. ఈ సినిమాలో ఆనంది గరివిడి లక్ష్మిగా ప్రధాన పాత్ర పోషించగా, సీనియర్ నటి రాశి ఆమె తల్లి దేవుడమ్మ పాత్రలో కనిపించారు. వీకే నరేశ్, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, కుశాలిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

సూపర్ న్యాచురల్ హారర్ థ్రిల్లర్ ‘డెమోంటే కాలనీ 3’ ఆన్ ది వే



, తెలుగులో రిలీజై మంచి టాక్ తెచ్చుకున్న తమిళ ఫ్రాంచైజీల్లో ఒకటి ‘డెమోంటే కాలనీ’ . ఆర్ అజయ్ జ్ఞానముత్తు రచన, దర్శకత్వంలో ఇప్పటికే డెమోంటే కాలనీ 2 కూడా వచ్చిందని తెలిసిందే. ఇప్పుడిక థర్డ్ పార్ట్ టైం వచ్చేసింది. సూపర్ న్యాచురల్ హారర్ థ్రిల్లర్‌గా రాబోతున్న డెమోంటే కాలనీ 3 విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. అరుల్ నిధి లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ మూవీ పలు వాయిదాల తర్వాత ఫైనల్‌గా 2027 పొంగళ్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. థర్డ్ పార్ట్‌లో అర్చనా రవిచంద్రన్ మీనాక్షి గోవింద రాజన్‌తోపాటు ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మూవీ ప్రమోషన్స్ త్వరలోనే షురూ కానున్నాయి. 2015లో చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద గ్రాండ్ సక్సెస్ అందుకుంది డెమోంటే కాలనీ. మళ్లీ 8 ఏండ్ల తర్వాత వచ్చిన సీక్వెల్ పార్ట్‌లో అరుణ్‌పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవిందరాజన్, అర్చన రవిచంద్రన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,